


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 141 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 2 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 141 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD THU 2 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## బీజేపీ ఓటు బ్యాంకు విజయన్‌కు బదిలీ అయ్యేలా మోదీ ప్రయత్నిస్తున్నారు

### కేరళలో ప్రచారంలో రేవంత్ రెడ్డి

ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు రేవంత్ రెడ్డి రోడ్ షో

ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్‌కు తేడా ఏమీలేదన్న తెలంగాణ సీఎం

కేరళ ప్రజలు చాలా తెలివైనవారన్న రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** కేరళలో బీజేపీ ఓటు బ్యాంకు సీఎం పినరయి విజయన్‌కు బదిలీ అయ్యేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తిరువనంతపురంలోని ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్‌కు తేడా ఏమీ లేదని ఆయన విమర్శించారు. కేరళ ప్రజలు చాలా తెలివైనవారని, విద్యావంతులను, మతతత్వ శక్తులను అస్సలు అనుమతించరని అన్నారు. బీజేపీ లాంటి పార్టీలు అధికారంలోకి రాకుండా కేరళ ప్రజలు లక్ష్మణ రేఖ గీశారని వ్యాఖ్యానించారు. కేరళకు భవిష్యత్తు లేకుండా చేయాలని మోదీ, పినరయి విజయన్ చూస్తున్నారని ఆరోపించారు.


- మిగతా2లో

## ఇరాన్ గత పాలకుడి కంటే ఇతను కొంచెం నయం

- కాల్పుల విరమణ కోసం ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అభ్యర్థించారని ట్రంప్ వెల్లడి
- అతడికి తక్కువ తీవ్రవాద భావజాలం, ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని వివరణ
- హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిస్తేనే కాల్పుల విరమణపై పరిశీలన అని షరతు
- షరతులు అంగీకరించకుంటే ఇరాన్‌ను నామరూపాల్లేకుండా చేస్తామని హెచ్చరిక
- మళ్లీ రాతియుగానికి పంపిస్తాం అంటూ పోస్ట్

- మిగతా2లో






## హైదరాబాద్‌లో 'హైడ్రా' కొరడా..

### రూ.100 కోట్ల ప్రభుత్వ భూమికి విముక్తి

- శాస్త్రిపురంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన హైడ్రా
- ఆటస్థలం కోసం కేటాయించిన రూ.100 కోట్ల భూమికి విముక్తి
- నిర్మాణంలో ఉన్న ఐదు +03 భవనాలు నేలమట్టం
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామన్న అధికారులు

- మిగతా2లో

## ఏపీ ప్రజలకు అభినందనలు.. కానీ మా సంగతేంటి?

- అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం... కానీ!: పొన్నం ప్రభాకర్
- బిల్లుకు చట్టబద్ధత నేపథ్యంలో ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపిన మంత్రి
- అయితే కేంద్రం తెలంగాణకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని విమర్శ
- ఒక రాష్ట్రానికి చట్టబద్ధత కల్పిస్తూ, మరో రాష్ట్రానికి హామీలు విస్మరించడం సరికాదన్న మంత్రి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభలో బిల్లు ఆమోదించడాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఇదే సమయంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.తెలంగాణ రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీల

- మిగతా2లో

## బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీలు టచ్‌లో ఉన్నారు

- సమయం వచ్చినప్పుడు వివరాలు చెబుతానన్న కవిత
- మావోయిస్టులు తమ పార్టీలో చేరుతారని వెల్లడి
- మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా కోసం పోరాటం చేస్తామని ప్రకటన



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు తమతో టచ్‌లో ఉన్నారని, సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు ప్రకటిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ, అసెంబ్లీలో సమయం అంతా అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం తిట్లు, విమర్శలు చేసుకోవడానికే సరిపోయిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను శ్రీరాముడిని, కేసీఆర్ రావణుడు అని చెబుతున్నారని, కానీ శకుని ఎవరో చెప్పాలని ఎద్దేవా చేశారు. తాను బర్బరీకుడిని అని ముఖ్యమంత్రి చెప్పుకుంటుంటే నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో మావోయిస్టులు కూడా తమ పార్టీలోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వారిది, తమది ఒకే అజెండా అని తెలిపారు. పార్టీ ఆవిర్భావానికి ముందు ఉమాభారతి సహా ఇతర పెద్దలను కలిసి ఆశీర్వాదం తీసుకుంటానని కవిత తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా కోసం పోరాటం చేస్తామని తెలిపారు. యువతకు ఉద్యోగాలు దక్కకుండా జీవోల పేరుతో ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 40 లక్షల కుటుంబాలలోని విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండగా, ప్రభుత్వం మాత్రం వారికి న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో చెప్పాలని నిలదీశారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు రేషన్ కార్డుల ఏరివేత కార్యక్రమం పెట్టుకుందని ఆరోపించారు. 15 లక్షల రేషన్ కార్డులు తీసివేయాలని చూస్తోందని మండిపడ్డారు.



## అనిల్ అంబానీ చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు...

### తాజాగా కేసు నమోదు చేసిన సీబీఐ

- ఎల్ఐసీకి రూ.3,750 కోట్ల నష్టం కలిగించారన్న ఆరోపణలు
- రిలయన్స్ కమ్యూనికేషన్స్, అనిల్ అంబానీపై సీబీఐ కేసు నమోదు
- తప్పుడు సమాచారంతో రూ.4,500 కోట్ల ఎన్‌సీడీలు విక్రయించారని ఫిర్యాదు
- ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక ఆధారంగా ఫిర్యాదు చేసిన ఎల్ఐసీ
- ఇప్పటికే పలు బ్యాంకుల మోసం కేసులను ఎదుర్కొంటున్న ఆర్‌కామ్

- మిగతా2లో

## కాజీపేట రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయండి

### అశ్వినీ వైష్ణవ్‌కు కేటీఆర్ లేఖ



- సికింద్రాబాద్ డివిజన్‌పై పని భారం విపరీతంగా పెరిగిందన్న కేటీఆర్
- కేటీఆర్ లేఖను కేంద్రమంత్రికి అందించిన బీఆర్ఎస్ ఎంపీల బృందం
- కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** కాజీపేట రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే కేటీఆర్ లేఖ రాశారు. కేటీఆర్ రాసిన లేఖను బీఆర్ఎస్ ఎంపీల

- మిగతా2లో



## ఇరాన్ మిస్సైళ్లు యూరప్‌ను కూడా తాకగలవు

- యూరప్‌ను తాకగల క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేసిందన్న రూబియో
- అణుబాంబు తయారీకి ఇరాన్ అత్యంత సమీపంలో ఉందని వెల్లడి
- ఇరాన్‌పై సైనిక చర్య విజయవంతంగా సాగుతోందన్న అమెరికా
- చర్చలకు సిద్ధమేనని, కానీ షరతులు వర్తిస్తాయని స్పష్టం
- హోర్ముజ్ జలసంధిలో జోక్యం చేసుకోవద్దని ఇరాన్‌కు హెచ్చరిక

- మిగతా2లో

## తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ

- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అసోంలో పర్యటించిన ప్రధాని మోదీ
- తేయాకు తోటను సందర్శించి మహిళా కార్మికులతో కలిసి ఆకులు కోసిన వైనం
- గోగముఖ్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరు
- అసోంలో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని ధీమా
- రాహుల్ గాంధీకి వందోసారి ఓటమి తప్పదని వ్యాఖ్యలు

- మిగతా2లో



## అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు

- లోక్ సభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ
- సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ఏర్పడిందన్న కిషన్ రెడ్డి
- కేంద్రంలోని కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించామని వ్యాఖ్య
- విభజన తర్వాత రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ముందుకు సాగాలన్న కిషన్ రెడ్డి

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

# అమరావతికి ఓకే.. కానీ, కండీషన్స్ అప్లై

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకుగాను ఏపీ పునర్విభజన చట్టానికి సవరణలు చేసేందుకు లోక్ సభ ఆమోదముద్ర వేసింది. అధికార, విపక్షాలు అన్నీ ఈ చట్ట సవరణకు మద్దతు తెలపడంతో మూజువాణి ఓటుతోనే లోక్ సభ ఆమోదముద్ర వేసినట్లైంది. అయితే సభలో ఈ అంశంపై మాట్లాడిన వివిధ పార్టీలు బిల్లుకు మద్దతు చెబుతూనే కొన్ని అభ్యంతరాలు లేవనెత్తడం విశేషంగా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా బిల్లును యథాతథంగా ఆమోదించలేమంటూ వాకౌట్ చేసిన వైసీపీతోపాటు బిల్లును సమర్థించిన కాంగ్రెస్, ఎస్పీ తదితర పార్టీలు కొన్ని కీలకసూచనలు చేశాయి.

రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన రైతులకు ముందుగా న్యాయం చేయాలని వివిధ పార్టీలు సూచించాయి. ప్రధానంగా వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ రాజధాని నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారు? రైతులకు అభివృద్ధి చేసి ఇస్తామన్న ప్లాట్లు ఎప్పుడిస్తారు? రైతులు ఎలా న్యాయం చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజధాని మొదటి దశ నిర్మాణం పూర్తికాకుండానే అదనపు భూ సమీకరణకు ఎందుకు వెళుతున్నారో స్పష్టం చేయాలని కోరారు.ఇక మిథున్ రెడ్డి తర్వాత సభలో మాట్లాడిన కాంగ్రెస్, సమాజ్ వాది ఎంపీలు సైతం అమరావతి బిల్లును సమర్థిస్తూనే కొన్ని సూచనలు చేశారు. ప్రధానంగా సమాజ్ వాది పార్టీకి చెందిన ఎంపీ ధర్మేంద్ర యాదవ్ వ్యాఖ్యలు ఆసక్తికర చర్చకు దారితీశాయి. రాజధాని అమరావతి బిల్లును తాము సమర్థిస్తున్నామని, అయితే రాజధానిగా విశాఖను ఎంపిక చేస్తే బాగుండేదని ధర్మేంద్ర యాదవ్ వ్యాఖ్యానించారు. అదేవిధంగా తమ పార్టీ రైతుల పక్షపాతి అని పేర్కొంటూ రాజధాని రైతులకు తక్షణ న్యాయం చేయాలని సమాజ్ వాది తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాగూర్ సైతం రాజధానిగా అమరావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎవరూ ఏపీకి అన్యాయం చేయాలని చూసినా తమ పార్టీ అంగీకరించదని తేల్చిచెప్పారు. అయితే రాజధాని రైతులకు న్యాయం చేయడం విస్మరించొద్దని సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ ఎంపీలు రఘురామిరెడ్డి, గడ్డం వంశీకృష్ణ సైతం రాష్ట్ర పునర్విభజన సవరణ బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. విభజన హామీలను నెరవేర్చాలని వంశీకృష్ణ కోరగా, ఖమ్మంజిల్లాకు చెందిన గ్రామాలను తిరిగి తెలంగాణకు వదిలేయాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి వ్యాఖ్యానించారు. మొత్తానికి రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే విషయంలో అన్నిపార్టీలు ఒకే మాటపై నిలబడినా, రాజధాని రైతుల విషయంలో విపక్షం కొంచెం గట్టిగా మాట్లాడటం ప్రత్యేకంగా నిలిచిందని అంటున్నారు.

# హైదరాబాద్‌లో 'హైడ్రా' కొరడా.. రూ.100 కోట్ల ప్రభుత్వ భూమికి విముక్తి

హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఏర్పాటు చేసిన 'హైడ్రా' మరో భారీ ఆపరేషన్ చేపట్టింది. రాజేంద్రనగర్ మండలం శాస్త్రిపురంలో ఆటస్థలం కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఐదు భవనాలను ఇవాళ కూల్చివేసింది. భారీ భద్రత నడుమ ఈ కూల్చివేత ప్రక్రియను పూర్తిచేశారు. స్వాధీనం చేసుకున్న ఈ భూమి విలువ సుమారు రూ. 100 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... హుడా (హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఆమోదించిన 188 ఎకరాల లేఅవుట్‌లో 6,500 చదరపు గజాల స్థలాన్ని ఆటస్థలం కోసం కేటాయించారు. అయితే, కొందరు వ్యక్తులు ఈ భూమిని కబ్జా చేసి, నకిలీ నోటరీ పత్రాలతో ఇతరులకు ప్లాట్లుగా విక్రయించారు. ఈ స్థలంలో నిర్మాణంలో ఉన్న ఐదు +౦3 భవనాలతో పాటు మరో రెండు చిన్న నిర్మాణాలను కూడా హైడ్రా బృందాలు నేలమట్టం చేశాయి. అయితే, మరో రెండు భవనాల్లో కొన్ని కుటుంబాలు నివసిస్తుండటంతో మానవతా దృక్పథంతో వాటిని కూల్చివేయలేదు. గతంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ కబ్జాదారులకు నోటీసులు జారీ చేసినా వారు పట్టించుకోలేదు. స్థానికుల నుంచి అందిన ఫిర్యాదులతో హైడ్రా, జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, కబ్జాలను నిర్ధారించుకున్న తర్వాత ఈ చర్యలు చేపట్టారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములను కాపాడేందుకు

2024లో తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు రూ.60,000 కోట్ల విలువైన 1,045 ఎకరాల ప్రభుత్వ భూములు, జలవనరులను తిరిగి స్వాధీనం చేసుకున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. గతేడాది అక్టోబర్‌లో బంజారాహిల్స్‌లో రూ.750 కోట్ల విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

# అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు

అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు తెలుపుతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అమరావతి చట్టబద్ధతపై లోక్ సభలో చర్చ జరిగింది. లోక్ సభలో కేంద్ర హోంశాఖ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ఏర్పడిందని ఆయన అన్నారు. కేంద్రంలోని కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించామని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో 1969లో కాంగ్రెస్ పార్టీ 369 మంది ఉద్యమకారులను కాల్చి చంపిందని ఆరోపించారు. జై తెలంగాణ అన్నందుకు విద్యార్థులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని మండిపడ్డారు. చివరి దశ తెలంగాణ ఉద్యమంలో కూడా 1200 మంది విద్యార్థులు ఆత్మార్పణ చేసుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నేడు ఏడు ఎయిర్ పోర్టులు ఉన్నాయని, తెలంగాణలో కేవలం ఒకే ఒక్క విమానాశ్రయం ఉందని అన్నారు.దీనికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యమే కారణమని ఆరోపించారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు పోటీతత్వంతో అభివృద్ధి కావాల్సి ఉందని అన్నారు. విభజన జరిగి పదేళ్లు దాటినా అమరావతిని రాజధానిగా చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బీజేపీ తరఫున అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు.

# బీజేపీ ఓటు బ్యాంకు విజయన్‌కు బదిలీ అయ్యేలా మోదీ ప్రయత్నిస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

అందుకే బీజేపీ ఓటు బ్యాంకును ఎల్డీఎఫ్‌కు బదిలీ అయ్యేలా చూస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

కేరళలో పినరయి విజయన్ సమయం అయిపోయిందని, యూడీఎఫ్ సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావడానికి అవకాశమే లేదని అన్నారు. ఎన్నికల తర్వాత ఇక్కడ పాలించేది కాంగ్రెస్ పార్టీయేనని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది తమ పార్టీయేనని అన్నారు.

# కాజీపేట రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయండి

బృందం ఢిల్లీలో కేంద్రమంత్రికి అందించింది. ఈ విజ్ఞప్తికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు బీఆర్ఎస్ ఎంపీలు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌పై పనిభారం విపరీతంగా పెరిగిందని కేటీఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్ ట్రాక్ పరిధి 2,755 కిలోమీటర్లుగా ఉందని, మున్ముందు వాడి-రాయచూర్, విష్ణుపురం-బీబీనగర్ డబ్లింగ్ పనులు పూర్తయితే ఈ ట్రాక్ పరిధి 3,150 కిలోమీటర్లకు చేరుకుంటుందని తెలిపారు. భారతీయ రైల్వేల పరిపాలనా ప్రమాణాల ప్రకారం ఒక డివిజన్‌కు ఉండాల్సిన పరిమితి కంటే ఇది ఎక్కువ అన్నారు. ఎక్కువ కిలోమీటర్లు, పనిభారం కారణంగా సికింద్రాబాద్ డివిజన్ నిర్వహణ క్లిష్టంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. కాజీపేట కేంద్రంగా డివిజన్‌ను ఏర్పాటు చేస్తే పరిపాలనా సులువు అవుతుందని అన్నారు. పరిపాలనా సౌలభ్యం, కార్యకలాపాల రీత్యా కాజీపేట డివిజన్ అత్యవసరమని ఆ లేఖలో పేర్కొన్నారు.

# ఇరాన్ గత పాలకుడి కంటే ఇతను కొంచెం నయం

అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ కొత్త నాయకత్వం తమతో కాల్పుల విరమణ కోరిందని వెల్లడించారు. అయితే, తాము అందుకు అంగీకరించాలంటే కీలకమైన హర్మూజ్ సముద్ర మార్గంపై తమ షరతులకు ఒప్పుకోవాల్సి ఉంటుందని అన్నారు. అంతవరకు సైనిక ఒత్తిడి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "గత పాలకుడితో పోల్చితే ఇరాన్ నూతన పాలకుడు (సుప్రీం లీడర్) కొంచెం నయం అనిపిస్తున్నాడు. అతడికి తక్కువ తీవ్రవాద భావజాలం, ఎక్కువ తెలివితేటలు ఉన్నాయి. ఇప్పుడతను అమెరికాతో కాల్పుల విరమణ కోరారు!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని స్వేచ్ఛగా, సురక్షితంగా తెరిచి ఉంచినప్పుడు మాత్రమే కాల్పుల విరమణ ప్రతిపాదనను పరిశీలిస్తామని ఆయన తేల్చిచెప్పారు. ప్రపంచ ఇంధన రవాణాలో హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైనది కావడంతో కాల్పుల విరమణకు ట్రంప్ ఈ అంశాన్ని ముందుకు తెస్తున్నారు. ఈ షరతులను నెరవేర్చే వరకు ఇరాన్‌పై సైనిక చర్యలను మరింత తీవ్రతరం చేస్తామని ట్రంప్ తన పోస్ట్‌లో హెచ్చరించారు. "మాటవినకుంటే ఇరాన్‌ను నామరూపాల్లేకుండా చేస్తాం లేదా వారు చెప్పినట్లుగా మళ్లీ రాతియుగానికి పంపిస్తాం!" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా విలేకరులతో మాట్లాడుతూ, ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు, ఒత్తిడిని కొనసాగించేందుకు తమ బలగాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణాను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# ఏపీ ప్రజలకు అభినందనలు.. కానీ మా సంగతేంటి?

- మొదటి పేజి తరువాయి

అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో తెలంగాణకు పలు కీలక హామీలు ఉన్నాయని, వాటి అమలు విషయంలో కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు.బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి కీలక ప్రాజెక్టులు ఇంకా ఆచరణకు నోచుకోలేదని అన్నారు. ఈ ప్రాజెక్టులు తెలంగాణ అభివృద్ధికి కీలకమని గుర్తుచేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఒక రాష్ట్రానికి చట్టబద్ధతతో ముందుకు తీసుకెళ్లే చర్యలు తీసుకుంటూ, మరో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించడం సరైనది కాదని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఇరాన్ మిస్సైళ్లు యూరప్‌ను కూడా తాకగలవు

యూరప్‌లోని సుదూర ప్రాంతాలను సైతం తాకగల క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేసిందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా చేపట్టిన సైనిక చర్యను సమర్థిస్తూ, ఇరాన్ ఆయుధ కార్యక్రమాలతో ప్రపంచానికి పెను ముప్పు ఉందని ఆయన హెచ్చరించారు.

ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రూబియో మాట్లాడుతూ, ఇరాన్ ఇటీవల ప్రయోగించిన క్షిపణులు తమ అంచనాలకు మించిన సామర్థ్యాన్ని ప్రదర్శించాయని తెలిపారు. "ఆ క్షిపణులు యూరప్‌లోని చాలా ప్రాంతాలకు చేరగలవు" అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో అమెరికా ప్రధాన భూభాగాన్ని కూడా లక్ష్యంగా చేసుకునే దీర్ఘశ్రేణి క్షిపణుల తయారీకి ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇరాన్ క్షిపణి, అణు కార్యక్రమాలను వేర్వేరుగా చూడలేమని రూబియో స్పష్టం చేశారు. "ఇరాన్ ఇప్పటికే 60 శాతం స్వచ్ఛతతో యురేనియంను శుద్ధి చేసింది. కేవలం 12 నుంచి 14 రోజుల్లోనే దాన్ని 90 శాతం స్వచ్ఛతకు (అణుబాంబు తయారీకి అవసరమైన స్థాయి) చేర్చగలదు. అణుబాంబులో ఉపయోగించడానికి తప్ప 60 శాతం శుద్ధి చేసిన యురేనియం వల్ల మరో ప్రయోజనం ఉండదు" అని ఆయన వివరించారు.

ఇరాన్ తన అణు కార్యక్రమానికి రక్షణ కవచంగా అత్యాధునిక ఆయుధాలను సమకూర్చుకోకుండా నిరోధించేందుకే సైనిక చర్య ప్రారంభించామని రూబియో తెలిపారు. ఇరాన్ వాయుసేన, నౌకాదళాన్ని ధ్వంసం చేయడం, క్షిపణి లాంచర్లను నిర్వీర్యం చేయడం, డ్రోన్లు, క్షిపణుల తయారీ ఫ్యాక్టరీలను ధ్వంసం చేయడం వంటి నాలుగు లక్ష్యాలతో ఈ ఆపరేషన్ సాగుతోందని చెప్పారు. "ఈ లక్ష్యాల సాధనలో మేము అనుకున్నదానికంటే వేగంగా ఉన్నాం. లక్ష్యానికి చాలా దగ్గరగా ఉన్నాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సైనిక చర్య కొనసాగుతున్నప్పటికీ, చర్చల ద్వారాలు తెరిచే ఉన్నాయని, ఇరుపక్షాల మధ్య సందేశాలు మార్పిడి జరుగుతున్నాయని రూబియో అన్నారు. అయితే, చర్చల పేరుతో కాలయాపన చేయడాన్ని సహించబోమని, దొంగచాటు చర్చలకు అంగీకరించబోమని స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాకు ఇరాన్ ఆటంకం కలిగిస్తే అది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలుగుతుందని హెచ్చరించారు.

# తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసోంలోని దిబ్రుగఢ్ జిల్లాలోని ఒక తేయాకు తోటను సందర్శించారు. అక్కడి మహిళా కార్మికులతో కలిసి తేయాకు ఆకులను కోశారు. వారితో సెల్ఫీలు దిగారు. ఈ ఫొటోలను మోదీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. పలువురు కార్మికులు మోదీతో సెల్ఫీ దిగేందుకు ఆసక్తి చూపించారు. మోదీ రాక నేపథ్యంలో గిరిజన కార్మికులు సంప్రదాయ నృత్యంతో ఆయనకు స్వాగతం పలికారు.

**బహిరంగ సభలో రాహుల్ గాంధీపై విమర్శలు**

అసోం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గోగముఖ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అసోంలో బీజేపీ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ యువరాజు రాహుల్ గాంధీకి వందోసారి ఓటమి తప్పదని ఎద్దేవా చేశారు.అసోం మాజీ సీఎం శర్బానంద సోనోవాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విభజన విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. అసోంలో ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఆదివాసీల హక్కులను కాపాడుతామని హామీ ఇచ్చారు.

# అనిల్ అంబానీ చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు... తాజాగా కేసు నమోదు చేసిన సీబీఐ

పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ, ఆయన సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తోంది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)కి రూ.3,750 కోట్ల మేర నష్టం కలిగించారన్న ఆరోపణలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) బుధవారం కేసు నమోదు చేసింది. ఈ కేసులో అనిల్ అంబానీ, ఆర్‌కామ్‌తో పాటు కొందరు గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులు, ఇతరులను నిందితులుగా చేర్చారు.ఎల్ఐసీ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదు చేసినట్లు సీబీఐ ఒక ప్రకటనలో తెలిపింది. కుట్ర, మోసం, నిధుల దుర్వినియోగం వంటి అభియోగాలతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆర్‌కామ్ ఆర్థిక పరిస్థితిపై తప్పుడు సమాచారం ఇచ్చి, ఆస్తులకు మించిన భద్రత ఉందని నమ్మించి, రూ.4,500 కోట్ల విలువైన నాన్-కన్వర్టిబుల్ డిబెంచర్లను (ఎన్‌సీడీ) ఎల్ఐసీకి మోసపూరితంగా అంటగట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీడీవో ఇండియా ఎల్ఎల్‌పీ అనే సంస్థ 2020 అక్టోబర్ 15న ఇచ్చిన ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను ఎల్ఐసీ తన ఫిర్యాదుకు ఆధారంగా చూపింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి సేకరించిన నిధులను దుర్వినియోగం చేయడం, అనుబంధ సంస్థల ద్వారా నిధులను దారి మళ్లించడం, నకిలీ బిల్లులతో నిధులు పొందడం వంటి అనేక అక్రమాలకు ఆర్‌కామ్ పాల్పడినట్లు ఆడిట్‌లో తేలింది.ఆర్‌కామ్, అనిల్ అంబానీపై సీబీఐ కేసులు నమోదు చేయడం ఇది మొదటిసారి కాదు. ఇప్పటికే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నేతృత్వంలోని పలు బ్యాంకులను మోసం చేశారన్న ఆరోపణలపై మూడు కేసులు నమోదయ్యాయి. ఎస్‌బీఐకి రూ.2,929.05 కోట్లు నష్టం కలిగించారన్న కేసులో సీబీఐ అధికారులు అనిల్ అంబానీని ఢిల్లీలో రెండు రోజుల పాటు విచారించారు కూడా. ఎస్‌బీఐతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి పలు బ్యాంకులు కూడా ఆర్‌కామ్‌పై ఫిర్యాదులు చేశాయి. ప్రస్తుతం ఈ కేసులన్నింటిపైనా దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ వెల్లడించింది.


బౌరంపేట్ డిఆర్‌కే కళాశాల పైభాగంలో భారీ అక్రమ షెడ్డు నిర్మాణం..

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

- దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో 'అధికారులు-చైన్‌మెన్‌' బరితెగింపు..
- చైన్‌మెన్‌ల మార్పులు చేర్పులతో అక్రమ కట్టడాలపై స్తంభించిన చర్యలు..
- బహదూర్‌పల్లి 1500 గజాల అక్రమ షెడ్డుకి అధికారుల వాటా ఎంత..?
- బౌరంపేట్ డిపిఎస్ ఎదురుగా భారీ షెడ్డుకు.. అయ్యప్ప స్వామి టెంపుల్ వద్ద రెండు..
- బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్‌కి వెళ్ళే దారిలో భారీ షెడ్డు నిర్మాణం..
- మల్లంపేట్‌లో చెన్నం చెరువు కట్టకింద అక్రమ కమర్షియల్ షెడ్డు..
- సంబంధిత షెడ్డును సందర్శించిన దుండిగల్ ఏసిపి.. చర్యలేవి సార్..?
- బౌరంపేట్‌లో డిఆర్‌కే "కళాశాల భవనం" పైభాగంలో భారీ అక్రమ షెడ్డు నిర్మాణం..

# అక్రమ షెడ్లను సందర్శించేది..!
# చర్యలకా..? సెటిల్మెంట్‌లకా..?

## ముడుపులే లక్ష్యంగా విధులు..? ఏసిబి దాడులు జరిగినా మార్పు శూన్యం..

ఇప్పటికే దుండిగల్ సర్కిల్ సిఎంసి పరిధిలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలుస్తుండగా..! వాటిని తలదన్నే స్థాయిలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా భారీ అక్రమ షెడ్లు నిర్మిస్తుండటం టౌన్‌ప్లానింగ్ విభాగం దోపిడీని బట్టబయలు చేస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. బహుదూర్‌పల్లి' బౌరంపేట్, మల్లంపేట్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారుల అండతో విచ్చలవిడిగా అక్రమ షెడ్లు.. సందర్శనలు, సంప్రదింపులు చర్యలు శూన్యం సెటిల్మెంట్‌లే టార్గెట్.. అధికారులు ఎవరైనా అక్రమ కట్టడాలపై సంపాదన కోసమేనని నిరూపణ.. అధికారపార్టీ నాయకుల సిఫార్సులు ఉన్నాయని నిస్సిగ్గుగా సమాధానం చెబుతున్న అధికారులు.. అక్రమ నిర్మాణాలు కూల్చాలన్నా- వదిలేయాలన్నా నియోజకవర్గంలోని ఓ ముఖ్యనేత ఆదేశానుసారమే అధికారుల కదలికలు ఉండాలని హుకుం జారీ చేసినట్టు, సంబంధిత అధికారులు తీవ్రంగా మదన పడుతున్నారాని సమాచారం..?

దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 1:

మల్లంపేట్ చెన్నం చెరువు కట్టకింద అక్రమ షెడ్డు నిర్మాణం..



-4లో

### లోక్ సభలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై.. కాంగ్రెస్ ఎంపీల ఆగ్రహం



హైదరాబాద్ పెన్ పవర్:ఏపీ అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సందర్భంగా లోక్ సభలో కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమాకారులను కాంగ్రెస్ కాల్చిచంపిందని వ్యాఖ్యానించారు.

-5 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
వివరాలు వర్తిస్తాయి



మొన్నటి కూల్చివేతల దృశ్యం..

# హైడ్రా చర్యలకు అడ్డుపడిన...
# దంపతులపై కేసు నమోదు

## గండిమైసమ్మ-మియాపూర్ 150 ఫీట్ల రోడ్డు ఆక్రమణలపై హైడ్రా చర్యలు

- దుండిగల్ సర్కిల్ పరిధిలో క్రమ కట్టడాలను మంగళవారం హైడ్రా కూల్చివేతలు..
- కూల్చివేతల్లో విధులకు ఆటంకం..! బాల్‌రెడ్డి,అతని భార్యపై ఫిర్యాదు..
- బిఎన్‌ఎస్ 221, 126 సెక్షన్ల కింద కేసు నమోదు దర్యాప్తు చేపట్టిన పోలీసులు..

దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 1: ఆక్రమణలపై మాత్రమే కాదు, ప్రభుత్వ చర్యలకు అడ్డం వచ్చిన వారిపై కూడా కఠిన చర్యలు తప్పవని హైడ్రా అధికారులు హెచ్చరించారు..హైడ్రా విధులకు ఆటంకం కలిగించారని ఓ దంపతులపై రెండు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొన్న మంగళవారం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గండిమైసమ్మ నుండి మియాపూర్ వెళ్లే 150 అడుగుల దారిలో అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు తొలగించారు..ఈ చర్యలు చేపడుతున్న సమయంలో విధులకు ఆటంకం కలిగించిన బౌరంపేట్ గ్రామానికి చెందిన పలుపునూరి బాల్‌రెడ్డి , అతని భార్యపై హైడ్రా ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్ ఫిర్యాదు చేశారు. దీంతో దుండిగల్ పోలీసులు బాల్‌రెడ్డి దంపతులపై బిఎన్‌ఎస్ సెక్షన్ 221, 126 ప్రకారం కేసును నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు..




# సమ్మర్ హాలిడేస్..

## తెలంగాణలో స్కూళ్లకు 48 రోజుల సెలవులు




హైదరాబాద్ పెన్ పవర్:ఎండలు దంచికొడుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిచ్చే వార్త చెప్పింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి వేసవి సెలవుల షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసింది. వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని స్కూళ్లకు సెలవులను అధికారులు ముందుగానే ప్రకటించారు. విద్యాశాఖ తాజా ప్రకటన ప్రకారం.. తెలంగాణలోని స్కూళ్లకు ఈ ఏడాది ఏకంగా 48 రోజుల పాటు వేసవి సెలవులు ఉండనున్నాయి. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు ఈ సెలవులు అమల్లో ఉంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ఈ నిబంధన వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం జూన్ 12న తిరిగి

-5 లో

-5 లో

# హెచ్‌సీఏపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సంచలన ఆరోపణలు


- హెచ్‌సీఏలో అక్రమాలు జరుగుతున్నాయని సీఎం సహా పలువురికి ఫిర్యాదు
- ఇప్పటి వరకు రూ.600 కోట్ల అక్రమాలు జరిగాయన్న గురువారెడ్డి
- అక్రమార్కులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్



# అక్రమ షెడ్లను సందర్శించేది..!

# చర్యలకా..? సెటిల్మెంట్‌లకా..?

## ముడుపులే లక్ష్యంగా విధులు..? ఏసిబి దాడులు జరిగినా మార్పు శూన్యం..



బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులో అక్రమ షెడ్డు..



బౌరంపేట్ టిపాయింట్ దగ్గరలో కమర్షియల్ షట్టర్‌లు..

- దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో 'అధికారులు-చైన్‌మెన్‌ల' బరితెగింపు..
- చైన్‌మెన్‌ల మార్పులు చేర్పులతో అక్రమ కట్టడాలపై స్తంభించిన చర్యలు..
- బహుదూర్‌పల్లి 1500 గజాల అక్రమ షెడ్డుకి అధికారుల వాటా ఎంత..?
- బౌరంపేట్ డపిఎస్ ఎదురుగా భారీ షెడ్డుకు.. అయ్యప్ప స్వామి టెంపుల్ వద్ద రెండు..
- బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్‌కి వెళ్ళే దారిలో భారీ షెడ్డు నిర్మాణం..
- మల్లంపేట్‌లో చెన్నం చెరువు కట్టకింద అక్రమ కమర్షియల్ షెడ్డు..
- సంబంధిత షెడ్డును సందర్శించిన దుండిగల్ ఏసిపి.. చర్యలేవి సార్..?
- బౌరంపేట్‌లో డిఆర్‌కే "కళాశాల భవనం" పైభాగంలో భారీ అక్రమ షెడ్డు నిర్మాణం..

ఇప్పటికే దుండిగల్ సర్కిల్ సిఎంసి పరిధిలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలుస్తుండగా..! వాటిని తలదన్నే స్థాయిలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా భారీ అక్రమ షెడ్లు నిర్మిస్తుండటం టౌన్‌ప్లానింగ్ విభాగం దోపిడీని బట్టబయలు చేస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. బహుదూర్‌పల్లి' బౌరంపేట్, మల్లంపేట్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారుల అండతో విచ్చలవిడిగా అక్రమ షెడ్లు.. సందర్శనలు, సంప్రదింపులు చర్యలు శూన్యం సెటిల్మెంట్‌లే టార్గెట్.. అధికారులు ఎవరైనా అక్రమ కట్టడాలపై సంపాదన కోసమేనని నిరూపణ.. అధికారపార్టీ నాయకుల సిఫార్సులు ఉన్నాయని నిస్సిగ్గుగా సమాధానం చెబుతున్న అధికారులు.. అక్రమ నిర్మాణాలు కూల్చాలన్నా-వదిలేయాలన్నా నియోజకవర్గంలోని ఓ ముఖ్యనేత ఆదేశానుసారమే అధికారుల కదలికలు ఉండాలని హుకుం జారీ చేసినట్టు, సంబంధిత అధికారులు తీవ్రంగా మదన పడుతున్నారాని సమాచారం..?

దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 1:




గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమ షెడ్డు..

దుండిగల్ సర్కిల్-59 సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారుల విధుల నిర్లక్ష్యం ప్రభుత్వ ఖజానాకు ఆటంకంగా తయారైంది.. కేవలం టిజి-బిపాస్ చట్టాన్ని ఎరగా వేసి రూ.కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయని సర్వత్రా ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి.. ఈ దందాలో కొందరు నాయకుల రికమండేషన్ పేరుతో అధికారులు, చైన్‌మెన్‌లు సిండికేట్‌గా ఏర్పడి సెటిల్మెంట్‌లు చేసుకోవడం పరిపాటిగా మారిందనే విమర్శలు లేకపోలేదు.. మొత్తం మీద చట్టాలు ఎన్నున్నా దోపిడి కామన్ అనే అభిప్రాయం ప్రజల్లో బలపడుతోంది.. నిత్యం ఎక్స్‌లో బిజీగా ఉండే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై వార్తా కథనాలతో దృష్టికి తీసుకెళ్ళినా, ప్రయోజనం శూన్యం.. ఈ వ్యవహారంలో మున్సిపల్ సర్కిల్‌ల స్థాయి నుండి ఉన్నతాధికారుల వరకు అక్రమ కట్టడాల దందా వ్యవహారం తెలిసే జరుగుతుందనే అభిప్రాయాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు..



బౌరంపేట్ అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో అక్రమ షెడ్డు..

## అక్రమ షెడ్లను సందర్శించిన ఏసిపి చర్యలేవి..?

దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల అక్రమ నిర్మాణాల దందా ఏ స్థాయికి చేరుకుందో చూడండి.. సర్కిల్ పరిధిలోని మల్లంపేట్ నుండి బాచుపల్లి వెళ్ళే రహదారిలో ఉన్న చెన్నం చెరువు కట్టకింద భాగంలో ఓ అక్రమ షెడ్డు నిర్మాణాన్ని దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసిపి శ్రీనివాస్ సందర్శించినా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. అధికారుల దృష్టిలో లేకపోతే ఫిర్యాదుల ద్వారా ఫొటోలు వెలు_త్నాయి.. పత్రికల్లో వార్తు వస్తున్నాయి.. అయినప్పటికీ చర్యలు మాత్రం శూన్యం..

## 'బహుదూర్‌పల్లి-బౌరంపేట్'లో అక్రమ షెడ్లపై చర్యలేవి..?

దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరు "చర్యలకు తక్కువ- సెటిల్మెంట్‌లకు ఎక్కువ" అన్న నానుడికి అద్దం పడుతోంది.. ఉన్నతాధికారుల మందలింపు కూడా లేదు.. సర్కిల్ ఉప కమిషనర్ కూడా పట్టించుకోవడం లేదనే చెప్పాలి.. బహుదూర్‌పల్లిలోని 1500 గజాల అక్రమ షెడ్డు వ్యవహారంలో అధికారపార్టీ యువనాయకుని సిఫార్సులు ఉన్నాయని వత్తాసు పలుకుతూ, టౌన్‌ప్లానింగ్ అధికారులు భారీగా ముడుపులు పుచ్చుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బౌరంపేట్‌లోని డిపిఎస్ ఎదురుగా భారీ షెడ్డుపై ప్రారంభం నుండి డిప్యూటీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ ఏసిపి-టిపిఎస్‌ల దృష్టికి తీసుకెళ్ళినా ఒప్పందం కుదుర్చుకుని సహకరించడం గమనార్హం.. బౌరంపేట్ అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో అక్రమ షెడ్డు నిర్మాణం.. సమీపంలోనే కమర్షియల్ షట్టర్‌లు అధికారులకు జేబులు నింపాయని స్పష్టమవుతుంది.. బౌరంపేట్ గ్రామ పరిధిలోని లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులో ఓ అక్రమ షెడ్డు నిర్మాణంపై ఏసిపి దృష్టికి తీసుకెళ్ళగా, సందర్శనలు, సెటిల్మెంట్‌లతో సరిపెడతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.. బౌరంపేట్ డిఆర్‌కే కళాశాల పైభాగంలో భారీ అక్రమ షెడ్డు నిర్మిస్తున్నప్పటికీ ప్రశ్నించిన వారితో తన దృష్టికి రాలేదని, టౌన్‌ప్లానింగ్ అధికారి బాధ్యతా రహితంగా చెప్పడం, గమనార్హం..



బహుదూర్‌పల్లిలో 1500 గజాల భారీ షెడ్డుకు టౌన్‌ప్లానింగ్ రక్షణ కవచం..




బౌరంపేట్ డిపిఎస్ ఎదురుగా భారీ అక్రమ షెడ్డు..

# మీరు లైడిటేక్టర్ టెస్టులు

**హైదరాబాద్, ఏప్రిల్ 1 పెన్ పవర్:** సినిమా ఇండస్ట్రీపై చేసిన వ్యాఖ్యలతో తెలంగాణలోని జడ్చర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వార్తల్లో నిలిచారు. చిత్రసీమలో మాదక ద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం ఎక్కువ అయ్యిందని ఆయన విమర్శలు చేశారు. అక్కడితో ఆగలేదు. వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అసలు ముందు అనిరుధ్ రెడ్డి ఏం అన్నారు? అనే అంశంలోకి వెళితే...డ్రగ్స్ టెస్టులకు, సినిమా విడుదలకు ముడి పెట్టారు అనిరుధ్ రెడ్డి చిత్రసీమలో నటీనటులు అందరూ ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని, డ్రగ్స్ తీసుకోలేదని స్పష్టం అయితేనే వాళ్ళ సినిమాలు విడుదల చేయాలనే నిబంధన తీసుకు రావాలని ఆయన పేర్కొన్నారు. రాజకీయ నాయకులు చెప్పే దానికంటే హీరోలు, నటీనటులు చెప్పేది ప్రజలు ఎక్కువ వింటారని, వాళ్ళు డ్రగ్స్ తీసుకున్నారని తెలిస్తే అభిమానులు సైతం వాళ్ళకు దూరంగా ఉంటారని అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారునటీనటులు డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కథానాయకుడు, నటుడు రాహుల్ రామకృష్ణ స్పందించారు. తాను హీరో కాకపోయినా అనిరుధ్ రెడ్డి సూచించిన టెస్టులు చేయించుకోవడానికి మాత్రం రెడీ అన్నారు. అర్జెంటుగా జీవో జారీ చేస్తే అందరం కలిసి చెయ్యిచ్చుకుందామని చెప్పారు. అయితే ఒక మెలిక పెట్టారు. కథానాయకుడు, 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు సైతం అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రియాక్ట్ అయ్యారు. మరి ఎన్నికల్లో నామినేషన్స్ ఫైల్ చేసే ముందు ర

నాయకులు ఎటువంటి టెస్టులు చేయించుకోవాలని ప్రశ్నించారు.మేము (నటీనటులం) డ్రగ్ టెస్టులు, మీరు (రాజకీయ నాయకులు) లై డిటెక్టర్ టెస్టులు... ప్రతి ఆదివారం ఈ గొప్ప కార్యక్రమం పెట్టుకుందాం. అప్పుడే మీ మాట, మా మాట నమ్మి ప్రజలు అందరూ అభివృద్ధి చెందుతారు" అని రాహుల్ రామకృష్ణ పేర్కొన్నారు. సోషల్ నెట్వర్కింగ్ సైట్ 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. మరి ఆయన రియాక్షన్ పట్ల అనిరుధ్ రెడ్డి స్పందిస్తారో లేదో చూడాలి

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## హెచ్‌సీఏపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సంచలన ఆరోపణలు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)పై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ) కార్యదర్శి గురువారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. హెచ్‌సీఏలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, సీఐడీ చీఫ్‌లకు ఆయన ఫిర్యాదు చేశారు. హెచ్‌సీఏలో 20 ఏళ్లుగా నిధుల దుర్వినియోగం జరుగుతోందని ఆరోపించారు.ఇప్పటి వరకు రూ.600 కోట్లకు పైగా అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. విశాఖ ఇండస్ట్రీస్‌కు రూ.69 కోట్లు బదిలీ కావడం కూడా అక్రమాల్లో భాగమేనని అన్నారు. ఐపీఎల్ టిక్కెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్నారని, దీనిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆస్తులైన క్లబ్బులను ప్రైవేటు వ్యక్తులకు బదిలీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమార్కులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సమ్మర్ హాలిడేస్.. తెలంగాణలో స్కూళ్లకు 48 రోజుల సెలవులు

-3 పేజి తరువాయి

పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.సెలవులు ప్రారంభమయ్యే లోపు సిలబస్ పూర్తి అయ్యేలా చూడాలని ప్రభుత్వం పాఠశాలల యాజమాన్యాలకు సూచించింది. అవసరమైతే విద్యాపరంగా ఎలాంటి అంతరాయం లేకుండా వారానికి ఒకసారి అదనపు తరగతులు నిర్వహించవచ్చని తెలిపింది.

## లోక్ సభలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై.. కాంగ్రెస్ ఎంపీల ఆగ్రహం

-3 పేజి తరువాయి

చివరి దశ ఉద్యమంలో కూడా 1200 మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ వచ్చిందన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ ప్రజలు రాష్ట్రాన్ని సాధించుకున్నారన్న కిషన్ రెడ్డి.. సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ కల సాకారమైందన్నారు. ఏపీలో ఏడు ఎయిర్ పోర్టులు ఉంటే.. తెలంగాణలో ఒక్కటే ఎయిర్ పోర్టు ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహార శైలితోనే తెలంగాణకు ఎయిర్ పోర్టులు రాలేదన్నారు కిషన్ రెడ్డి. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాలు కలిసి అభివృద్ధిలో ముందుకెళ్లాలని సూచించారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు అభ్యంతర తెలిపారు. కిషన్ రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు. విభజన హామీలను కేంద్రం నెరవేర్చాలన్నారు. బీజేపీ ఇచ్చిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు.

## మూతపడ్డ చికెన్ దుకాణాలు

**సికింద్రాబాద్ పెన్ పవర్:** సికింద్రాబాద్లోని పలు ప్రాంతాలలో చికెన్ దుకాణాలను మూసివేశారు.చికెన్ విక్రయదారులు బంద్ చేపట్టడంతో సికింద్రాబాద్ వ్యాప్తంగా మాంసం ్కాణాలు మూతపడ్డాయి. కంపెనీలు కమీషన్లు భారీగా తగ్గించడాన్ని నిరసిస్తూ తెలంగాణ చికెన్ సెంటర్ల అసోసియేషన్ ఈ బంద్కు పిలుపునిచ్చింది. అయితే వ్యాపారుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అసోసియేషన్ పిలుపుతో
రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చికెన్ షాపులు మూతపడ్డాయి.

## అమరజ్యోతి భవనంలో వైర్లను ఎలుకలు కొరుకుతున్నాయి

**హైదరాబాద్: పెన్ పవర్:** తెలంగాణ సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం, అమరజ్యోతి భవనాలకు మూడేళ్లుగా మెయింటైనెన్స్ నిధులు కేటాయించడంలేదని మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ కట్టించాడు కాబట్టి నిధులు ఇవ్వకుండా అది చెడిపోతే ఆయనను బద్నాం చేయాలనే కుట్ర చేస్తున్నారు. అమరజ్యోతి భవనంలో వైర్లను ఎలుకలు కొరుకుతున్నాయి. అంబేద్కర్ విగ్రహం వద్ద గేటుకు తాళం వేసి ఉంచారు. నాకు తెలిసి సొంత ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలని చూసే ఏకైక ప్రభుజ్వం ప్రపంచంలో ఇదొకటే నని అయన అన్నారు.

## మరుసటి రోజు నిశ్చితార్థం..యువకుడి మృతి

**ఖమ్మం పెన్ పవర్:** రేపు నిశ్చితార్థం వుంది. ఒక రోజు ముందు రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చెందాడు. మద్దులపల్లి స్టేజ్ వద్ద రోడ్డు దాటుతున్న ప్రసాద్(28) అనే యువకుడిని, కారు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రసాద్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కొండగట్టులో అపశృతి చలువ పందిరి కూలి భక్తులకు గాయాలు

**జగిత్యాల పెన్ పవర్:** కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో అపశృతి చోటు చేసుకుంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. గురువారం నాడు హనుమాన్ విజయోత్సవ దినం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లనే ఈ దుర్ఘటన జరిగిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సమ్మర్ కు ముందే పడిపోతున్న భూగర్భ జలాలు

**హైదరాబాద్., ఏప్రిల్ 1, పెన్ పవర్:** హైదరాబాద్‌లో భూగర్భ జలాలు తగ్గడంతో నీటి ట్యాంకర్ల డిమాండ్ భారీగా పెరిగింది. మార్చిలోనే రోజువారీ ట్యాంకర్ల బుకింగ్స్ 8500 మార్కును చేరగా.. ఏప్రిల్ నాటికి ఇది 10 వేలకు చేరుతుందని జలమండలి అంచనా వేస్తోంది. గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్ వంటి ఐటీ ప్రాంతాల్లో బోర్లు ఎండిపోవడంతో ప్రైవేట్ ట్యాంకర్ల ధరలు పెరిగాయి. జలమండలి 1100 ట్యాంకర్లతో సరఫరాను ముమ్మరం చేసినప్పటికీ.. పెరుగుతున్న ఎండల దృష్ట్యా నీటి ఎద్దడి మరింత పెరిగేలా కనిపిస్తోంది.సమ్మర్ వచ్చిందంటే చాలు హైదరాబాద్ నగరంలో నీటి ఎద్దడి మట్నదలవుతుంది. ఇది ప్రతి ఏడాది ఉండే తంతే. అయితే ఈసారి కాస్త ముందుగానే నగర ప్రజలకు నీటి కష్టాలు మట్నదలయ్యాయి. నగరంలో వేసవి వేడి సెగలు మొదలవకముందే మంచినీళ్ల కష్టాలు ముదిరిపోయాయి. వాతావరణ మార్పులు, అడుగంటిపోతున్న భూగర్భ జలాల కారణంగా నగరవాసులు చుక్క నీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత నెల రోజుల్లోనే నీటి ట్యాంకర్ల డిమాండ్ అనూహ్యంగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఫిబ్రవరి చివరలో రోజుకు సగటున 5 వేల ట్యాంకర్ల కంటే తక్కువ డిమాండ్ ఉండగా.. మార్చి నెలాఖరు నాటికి ఆ సంఖ్య 8,500కు చేరుకుంది. ఏప్రిల్ నాటికి ఈ డిమాండ్ రోజుకు 10 వేల ట్యాంకర్లకు చేరుకోవచ్చని జలమండలి అంచనా వేస్తోంది.ముఖ్యంగా హైదరాబాద్ నగరం పశ్చిమ భాగంలోని ఐటీ కారిడార్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, కూకట్‌పల్లి, నిజాంపేట వంటి ప్రాంతాలతో పాటు ఉప్పల్, మల్కాజిగిరి, అమీర్‌పేట ఏరియాల్లో 50 శాతానికి పైగాబోర్లు అడుగంటిపోయాయి. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్‌లు, విల్లాలు ఇప్పుడు పూర్తిగా ట్యాంకర్ల మీదే ఆధారపడుతున్నాయి. హాస్టళ్లు, వాణిజ్య సముదాయాల్లో నీటి వినియోగం ఎక్కువగా ఉండటంతో నిత్యం బోర్లపైనే ఆధారపడే వీరంతా ఇప్పుడు నీటి కోసం అల్లాడుతున్నారు. జలమండలి నిబంధనల ప్రకారం 24 గంటలకు ఒకసారి మాత్రమే



ట్యాంకర్ బుక్ చేసుకునే అవకాశం ఉండటంతో.. ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్ల వైపు మొగ్గు చూపుతున్నారు.డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ట్యాంకర్ల నిర్వాహకులు ధరలను భారీగా పెంచేశారు. గతం కంటే ఒక్కో ట్యాంకర్‌పై రూ. 200 నుండి రూ. 500 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. దూరం,
అవసరాన్ని బట్టి రేట్లను ఇష్టానుసారంగా నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా జలమండలికి చెందిన 1,100 ట్యాంకర్లు 140 ఫిల్లింగ్ పాయింట్ల ద్వారా నిరంతరాయంగా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోవడం సవాలుగా మారింది. ఏప్రిల్, మే నెలల్లో ఈ కష్టాలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉండటంతో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.కాగా, కొందరు ప్రైవేట్ ట్యాంకర్ యజమానులు అనధికారికంగా జలమండలి అధికారిక లోగోను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అలా లోగో వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి హెచ్చరించారు. ఇటీవల కొందరు ప్రైవేట్ బోర్‌వెల్ ట్యాకర్ల ఆపరేటర్లు లోగో, బ్రాండ్‌ను వినియోగిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇలా చేయటం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడమే కాకుండా మోసపూరిత చర్యగా గుర్తిస్తామన్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా భావించి లోగో దుర్వినియోగం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ హెచ్చరించారు.

# కొత్తగూడెం కేంద్రంగా డివిజన్

**ఖమ్మం, ఏప్రిల్ 1, పెన్ పవర్:**
కొత్తగూడెం కేంద్రంగా రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్రలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కొత్తగూడెం రైల్వేస్టేషన్ తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లకు రాకపోకలు సాగించే రైళ్లకు కూడలిగా మారినందున దాన్ని ప్రధానకేంద్రంగా మార్చాలన్నారు. కొత్తగూడెంకు బ్రిటిష్‌పాలన నుంచి చారిత్రక నేపథ్యం ఉందని ఈ సందర్భంగా తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఇక్కడి నుంచి బొగ్గు రవాణా జరిగేదని.. సింగరేణి కాలరీస్‌కు ఇప్పుడు ఇది ఒక ప్రధాన కేంద్రంగా మారిందన్నారు.గూడ్స్ ట్రైన్ల రవాణా ద్వారా భారతీయ రైల్వేకు అత్యధిక ఆదాయం సమకూరుస్తున్న ప్రాంతాల్లో కొత్తగూడెం ఒకటిఅన్నారు. కొత్తగూడెం-కిరండోల్, మల్కన్‌గిరి-భద్రాచలం, కొత్తగూడెం-సత్తుపల్లి-కొవ్వూరు, జునాగఢ్-మల్కన్‌గిరి-భద్రాచలం లింకులతో ఈ స్టేషన్ నాలుగు రాష్ట్రాల ప్రధాన కూడలిగా మారిందని వెల్లడించారు. 2032 నాటికి వందేళ్లు పూర్తిచేసుకోబోతున్న ఈ స్టేషన్‌కు తగిన గుర్తింపు ఇవ్వాలని స్థానిక ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నారని గుర్తు చేశారు. శతవసంతాల గుర్తుగా కొత్తగూడెం కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేసి ఈ ప్రాంతానికి న్యాయం చేయాలని ఎంపీలు కేంద్రమంత్రికి సమర్పించిన వినతిపత్రంలో వెల్లడించారు.కాగా, కొత్తగూడెం కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఆ ప్రాంత సామాజిక, ఆర్థిక ముఖచిత్రం గణనీయంగా మారుతుందని నిపుణులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉండటం వల్ల పరిపాలనాపరమైన నిర్ణయాల్లో జాప్యం జరుగుతోందని... కొత్తగూడెం కేంద్రంగా డివిజన్‌ఏర్పాటైతే ఈ ప్రాంతానికి స్వయంప్రతిపత్తి లభించి, రైల్వే మౌలిక సదుపాయాల కల్పన వేగవంతమవుతుందని చెబుతున్నారు. సింగరేణి కాలరీస్, కె.టి.పి.ఎస్, ఐటిసి వంటి భారీ పరిశ్రమలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని... బొగ్గు రవాణా ద్వారా రైల్వేకు వచ్చే భారీ ఆదాయం ఇక్కడి అభివృద్ధికి తిరిగి వినియోగించబడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.స్థానిక ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త రైళ్లను ప్రారంభించేందుకు, రైళ్ల సమయాలను క్రమబద్ధీకరించేందుకు వీలవుతుంది. భద్రాచలం వంటి పుణ్యక్షేత్రానికి దేశవ్యాప్త అనుసంధానం పెరుగుతుందని అంటున్నారు. డివిజనల్ కార్యాలయం ఏర్పాటుతో వందలాది మందికి ప్రత్యక్షంగా, వేలాది మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. స్థానిక వ్యాపారాలు పుంజుకుంటాయని చెబుతున్నారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే లైన్ల నిర్మాణం, స్టేషన్ల ఆధునీకరణ పనులు వేగంగా పూర్తవుతాయని.. కొత్తగూడెం రైల్వే డివిజన్ ఏర్పాటు కేవలం రవాణా సౌకర్యమే కాకుండా, వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఒక గ్రోత్ ఇంజిన్‌లా పనిచేస్తుందని అంటున్నారు.

# అజార్ కు అమాత్య ..యోగం ఉన్నట్టా.. లేనట్టా...

**ఖమ్మం, ఏప్రిల్ 1, పెన్ పవర్:** అజారుద్దీన్ మంత్రి పదవి ఉంటుందా.. ఊడుతుందా.. తెలంగాణ రాజకీయవర్గాల్లో జోరుగా వినిపిస్తున్న చర్చ ఇది. దీనికి కారణం.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఫైల్ ఇప్పటికీ పెండింగ్‌లో ఉండడమే ! ఏ చట్టసభల్లో సభ్యుడిగా లేకపోయినా.. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా అజారుద్దీన్‌ను మంత్రిని చేసింది కాంగ్రెస్ సర్కార్. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ చేస్తూ రేవంత్ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఆ ఫైల్ గవర్నర్ దగ్గరే ఉంది. మంత్రి పదవి కొనసాగాలంటే.. ఆరు నెలల్లోగా శాసనసభ లేదా శాసన మండలిలో అజారుద్దీన్‌కు సభ్యత్వం తప్పనిసరి. ఐతే వచ్చే నెల 30వ తేదీతో.. ఆయన మంత్రి పదవి చేపట్టి ఆరు నెలలు ముగుస్తుంది. ఇంకా 30 రోజులు మాత్రమే టైమ్ ఉండటంతో.. ఇప్పుడేం జరగబోతుందనేది ఆసక్తి రేపుతోంది. గవర్నర్ దగ్గర ఫైల్ ఇలానే పెండింగ్‌లో ఉంటే పరిస్థితి ఏంటనే చర్చ జరుగుతోంది. ఐతే దీనికి రేవంత్ సర్కార్ ప్లాన్ బీ సిద్ధం చేసిందనేటాక్ నడుస్తోంది.అక్టోబర్ 31న తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ రోజు నుంచి 6 నెలల లోపు చట్టసభల్లో సభ్యుడు కావాలి. అంటే ఏప్రిల్ 30లోపు ఆయన చట్టసభల్లో సభ్యుడు కావాలన్నమాట. నాలుగు నెలల కిందటే.. కేబినెట్ ఆమోదించి గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అజారుద్దీన్‌ను

నామినేట్ చేసింది. ఐతే బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ సుప్రీంకోర్టులో కేసు వేశారు. దీంతో అప్పటి నుంచి ఇప్పటివరకు ఆఫైల్‌ను గవర్నర్ పెండింగ్‌లో పెట్టారు. ఈ మధ్యే విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. మరోసారి గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే.. హైకోర్టుకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో అజారుద్దీన్ మంత్రి పదవి విషయంలో ఏం జరగబోతుందనే ఆసక్తి కనిపిస్తోంది.ఈ మధ్యే రాష్ట్రానికి కొత్త గవర్నర్ వచ్చారు. దీంతో మరోసారి గవర్నర్‌ను కలిసేందుకు సీఎం రేవంత్ సిద్ధం అవుతున్నారని తెలుస్తోంది.ఏప్రిల్ మొదటి వారం గవర్నర్‌తో భేటీ అయి.. అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరనున్నట్లు సమాచారం. మళ్లీ కోర్టుకు వెళ్తే ఆలస్యం అవడం తప్ప.. వచ్చే లాభం లేదని, వీలైనంత త్వరగా ఫైల్ క్లియర్ చేయాలని గవర్నర్‌ను ప్రభుత్వ పెద్దలు కోరనున్నారట. ఐతే సాంకేతిక కారణాలతో ఫైల్‌ను గవర్నర్ పెండింగ్‌లో పెడితే మాత్రం.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి గండం తప్పదనే వాదనలు వినిపిస్తున్నాయ్. దీంతో ప్రభుత్వ పెద్దలు ప్లాన్ దీ అమలు చేసేందుకు రెడీ

అవుతున్నారట. ఒకవేళ గవర్నర్ నుంచి సానుకూల స్పందన రాకపోతే.. అజారుద్దీన్ చేత రాజీనామా చేయించి.. మే రెండో వారంలో జరిగే కేబినెట్ విస్తరణలో మరోసారిఅవకాశం కల్పించాలనే ఆలోచన చేస్తున్నారని టాక్.ఓవరాల్‌గా లాస్ట్ బాల్‌కు అజారుద్దీన్ సిక్స్ కొడతారా.. డకౌట్ అవుతారా అనేది గవర్నర్ నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది. ఇక అటు త్వరలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయ్. ఇలాంటి సమయంలో అజారుద్దీన్‌కు మంత్రి పదవి దూరం అయితే.. కాంగ్రెస్‌కు సమస్యగా మారే అవకాశం ఉంటుంది. దీంతో ఈ విషయంపై రేవంత్ సర్కార్ సీరియస్‌గా ఉంది.గవర్నర్ నిర్ణయం సానుకూలంగా లేకపోతే... ప్లాన్ దీ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది

# పాతబస్తీలో హైడ్రా భారీ ఆపరేషన్

### క్రీడామైదానంలో అక్రమ కట్టడాల తొలగింపు
### 5 నిర్మాణదశలో ఉన్న భవనాల కూల్చివేత
### రూ. 100 కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా



**హైదరాబాద్, ఏప్రిల్ 01 పెన్ పవర్:** : పాతబస్తీ మైలర్దేవుపల్లిలో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. 6500 గజాల క్రీడమైదానాన్ని కాపాడింది. దీని విలువ రూ. 100 కోట్లవరకు వుంటుందని అంచనా. హెచ్ఎండియే అనుమతి పొందిన లేఔట్లో స్పష్టంగా క్రీడామైదానం అని పేర్కొన్నా ఆక్రమణలకు తెగబడిన వారికి కూల్చివేతలతో బుద్ధి చెప్పింది.

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం మైలార్దేవుపల్లి విలేజ్ శాస్త్రిపురం కాలనీలో హైడ్రా బుధవారం భారీ ఆపరేషన్ నిర్వహించింది. 188 ఎకరాల హుడా అనుమతి పొందిన లేఔట్లో క్రీడాస్థలం కోసం కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా తొలగించింది. జీ ప్లస్ 3 అంతస్తుల నిర్మాణ దశలో ఉన్న భవనాలు ఐదింటిని హైడ్రా తొలగించింది. మరో రెండు సింగిల్ రూమ్ నిర్మాణాలను తొలగించింది. 1800 ల ప్లాట్లకు పైగా ఉన్న ఈ లేఔట్ ప్రకారం 6500 గజాల స్థలాన్ని ప్లే గ్రౌండ్ కోసం కేటాయించారు. క్రీడస్థలానికి కేటాయించిన స్థలం అని తెలిసి కూడా గత 3 సంవత్సరాలుగా నోటరీ మీద స్థానికంగా ఉన్న కబ్జాదారులు ప్లాట్లుగా అమ్మేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. జీహెచ్ఎంసి గతంలో నోటీసులు కూడా ఇచ్చింది. 2024లో కూల్చివేతలు చేస్తామని ఆర్డర్లు కూడా జారీ చేసింది. అయినా పట్టించుకోకుండా అక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయి. యిదే విషయమై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు జీహెచ్ఎంసి, రెవెన్యూ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించింది. లేఔట్ ప్రకారం క్రీడాస్థలం కోసం కేటాయించిందని నిర్ధారణ చేసుకుంది. నిర్మాణాలు చేపట్టవద్దని వెంటనే హైడ్రా హెచ్చరించింది. బుధవారం ఉదయం ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 5 నిర్మాణంలో ఉన్న భావనలతో పాటు రెండు చిన్న గదులతో నిర్మించిన వాటిని తొలగించింది. ఇంకో రెండు భవనాల్లో ఇప్పటికే నివాసాలు ఉండడంతో వాటిని మినహాయించింది. క్రీడామైదానం అందుబాటులోకి రావడంతో శాస్త్రిపురం కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

హైడ్రాకు ఫిర్యాదు చేయగానే చర్యలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆక్రమణలు అడ్డుకుంటే భయపెట్టారని.. హైడ్రా రావడంతో క్రీడాస్థలం కాపాడుకోగలిగామని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల పోరాటం ఫలించిందని సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ కబ్జా చేసిన వాళ్లు సామాన్యులు కాదని.. అడ్డుకున్నవాళ్లను బెదిరించారని తెలిపారు.

# కవితతో వచ్చేదెవరు...




**హైదరాబాద్, ఏప్రిల్ 1, పెన్ పవర్:**
కవిత కొత్త పార్టీ దాదాపు ఖాయమైపోయింది. ఆమె తన రాజకీయ ప్రయాణాన్ని ఒంటరిగానే మొదలు పెట్టడానికి సిద్ధమయ్యారు. మొదట్లో ఉగాది తర్వాత పార్టీ ఏర్పాటు చేస్తారని ప్రచారం జరిగింది. ఇటీవల ఆమె పార్టీకి సంబంధించిన కొన్ని వ్యవహారాలు లీగల్ ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. అయితే ఇప్పుడు ఆ సమస్యలు మొత్తం క్లియర్ కావడంతో రాజకీయ పార్టీ ఏర్పాటుకు కవిత శ్రీకారం చుట్టినట్టు కనిపిస్తోంది.కవిత రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఆమె వెంట ఎవరు వస్తారు.. ఆమెతో ఎవరు ఉంటారు.. ఆమె కోరుకున్నట్టుగా తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో రాజకీయ శున్యత కనిపిస్తోందా.. అనే ప్రశ్నలను రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. అయితే వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంది. అంతేకాదు.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కేంద్రం స్పష్టం చేసిన నేపథ్యంలో కవిత ఏర్పాటు చేయబోయే పార్టీపై అందరి ఆసక్తి నెలకొంది. కవిత మహిళా రిజర్వేషన్ బిల్లు ఏర్పాటు చేయాలని.. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమాలు చేశారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద దీక్షలు కూడా చేశారు. ప్రస్తుతం ఆమె ఏర్పాటు చేయబోయే పార్టీకి అధ్యక్షురాలుగా ఉన్న నేపథ్యంలో.. మహిళలకు ఆమె పెద్దపీట వేసే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే కవిత చేపట్టే ప్రతి ధర్నా.. నిరసన కార్యక్రమంలో ఆడవాళ్లు ఎక్కువగా కనిపిస్తున్నారు. పైగా రాజకీయాల్లోకి ఆడవాళ్లు రావాలని కవిత చాలా సంవత్సరాల నుంచే కోరుతున్నారు. అయితే తన పార్టీ నుంచి ఎక్కువగా ఆడవాళ్లకు అవకాశం కల్పించి.. మహిళా సాధికారతను చేతల్లో చూపిస్తారని తెలుస్తోంది.లిక్కర్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొని.. ఆ తర్వాత కోర్టు ద్వారా ఉపశమనం పొందిన కవిత.. ఇప్పుడు క్లీన్ ఇమేజ్ సాధించారు. తను మొదటి నుంచి చెబుతున్నట్టుగానే అదంతా కూడా కక్ష సాధింపు చర్య అని జనాలలోకి బలంగా తీసుకెళ్లారు. తద్వారా పులు కడిగిన ముత్యం లాగా తాను బయటికి వచ్చానని కవిత చెబుతున్నారు.

అందువల్లే తాను రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. తన మానస పుత్రిక అయిన జాగృతిని పార్టీ పేరులో ఏర్పాటు చేస్తున్న కవిత.. రాజకీయ లక్ష్యాలను బలంగానే నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. కవిత రాజకీయ పార్టీ ఏర్పాటు చేయకముందు సింగరేణి నుంచి కొంతమంది కార్మిక సంఘం నాయకులు ఆమెకు మద్దతు పలికారు. ఆమెతో కలిసి ప్రయాణం చేస్తామని ప్రకటించారు. ఇక ఇటీవల కవిత తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించినప్పుడు కొంతమంది నాయకులు ఆమెను కలిశారు. కవిత సపోర్ట్ తో ఇటీవల ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఓ మున్సిపాలిటీని నాయకులు కైవసం చేసుకున్నారు. ఆ తర్వాత వారు కాంగ్రెస్ పార్టీకి జై కొట్టారు. ఇప్పుడు కవితతో ఎవరు వస్తారు.. ఎవరు ఆమెకు అండగా ఉంటారు.. పార్టీ నిర్మాణం.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు.. ఆమెకు అనుకూలిస్తాయా.. అనే ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.

మరి వీటికి సమాధానం కవిత ఏ రూపంలో చెప్తారో చూడాల్సి ఉంది.

# తెలంగాణలో క్యాన్సర్ డేంజర్ బెల్స్
# కొత్తగా 46,762 క్యాన్సర్ కేసులు



**హైదరాబాద్, ఏప్రిల్ 1, పెన్ పవర్:** తెలంగాణలో క్యాన్సర్ మహమ్మారి చాపకింద నీరులా వేగంగా విస్తరిస్తోంది. క్యాన్సర్ బాధితుల సంఖ్య ప్రతి ఏడాది వేలల్లో పెరుగుతున్నా.. ముందస్తు పరీక్షల పట్ల ప్రజల్లో అవగాహన లోపించడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై తెలంగాణ క్యాన్సర్ బర్డెన్ ప్రొఫైల్-2026 పేరుతో ఐసీఎంఆర్ విడుదల చేసిన తాజా నివేదిక దిగ్భ్రాంతికర నిజాలను వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రంలో క్యాన్సర్ కేసులు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయని నివేదికలో తెలిపారు. ప్రతి ఏటా వేల సంఖ్యలో కొత్త కేసులు వెలుగుచూస్తున్నాయని.. అయినా వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించే స్క్రీనింగ్ పరీక్షల రేటు మాత్రం అత్యల్పంగా ఉందన్నారు. నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో 30-49 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళల్లో కనీసం 4 శాతం మంది కూడా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడం లేదు. ఇది వేలాది మంది ప్రాణాలను ముప్పులోకి నెడుతోంది.మహిళల్లో అత్యంత సాధారణంగా కనిపించే రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ రేటు కేవలం 0.3 శాతంగానే ఉందని నివేదిక వెల్లడించింది. అలాగే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు 3.3 శాతం, నోటి క్యాన్సర్ పరీక్షలు 2.5 శాతం మంది మహిళలు మాత్రమే చేయించుకుంటున్నారు. పురుషుల్లో కేవలం 2.6 శాతం మంది మాత్రమే నోటి క్యాన్సర్ పరీక్షలు చేయించుకున్నారు. నిమ్స్‌తో పాటు మరో 10 హాస్పిటల్స్ నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. 2026 చివరి నాటికి తెలంగాణలో కొత్తగా 46,762 క్యాన్సర్ కేసులు నమోదవుతాయని అంచనా. ఇందులో పురుషులు 21,252 మంది కాగా.. మహిళలు 25,510 మంది ఉన్నారు. 2030 నాటికి ఈ సంఖ్య ఏడాదికి 47,314కు చేరుతుందని అంచనా వేస్తున్నారు.ఇక గడిచిన దశాబ్ద కాలంలో క్యాన్సర్ కేసుల సంఖ్య 30 శాతం పెరిగింది. 2015లో 40,177గా ఉన్న కేసులు, 2024 నాటికి 52,334 కు చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మహిళల్లో ప్రతి లక్ష మంది జనాభాకు 183.8 మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. పురుషుల్లో ఈ రేటు 141.9గా ఉంది. రాష్ట్రంలో నమోదవుతున్న క్యాన్సర్లలో పొగాకు వాడకం వల్ల వచ్చే కేసులే ఎక్కువగా ఉన్నాయి. పురుషుల్లో 58.8 శాతం, మహిళల్లో 29.7 శాతం క్యాన్సర్లు పొగాకు వల్లే వస్తున్నాయి. ముఖ్యంగా నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, గొంతు క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. దీనికి తోడు ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు కూడా క్యాన్సర్ ముప్పును పెంచుతున్నాయి. మహిళల్లో పీసీఓడీ, హార్మోన్ల సమస్యలు కూడా క్యాన్సర్‌కు దారితీస్తున్నాయి. ముందస్తు పరీక్షలు చేయించుకోకపోవడం వల్లే చాలా మంది రోగులు వ్యాధి ముదిరిన తర్వాత ఆస్పత్రులకు వస్తున్నారని వీఛీజీ క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్లు పేర్కొంటున్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేసే అవకాశం ఉన్నప్పటికీ.. ఆలస్యం కావటం వల్ల చికిత్స క్లిష్టతరంగా మారుతోందన్నారు. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా స్క్రీనింగ్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలని.. పొగాకు నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ‘శ్రీదేవి డ్రామా కంపెనీ’

### “రోగులు ఎటు పోతే మాకేంటి?... మా ఎంజాయ్ మేమే!”
### రోగుల మధ్య పదవి విరమణ సంబరాలు
### ఆసుపత్రి సిబ్బందిపై తీవ్ర విమర్శలు

**భద్రాచలం పెన్ పవర్:** ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి, ఒక్కసారిగా వినోద వేదికగా మారింది. భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నర్సింగ్ సూపరింటెండెంట్ పదవీ విరమణ వేడుక పేరుతో నిర్వహించిన కార్యక్రమం, రోగుల బాధలను పక్కన పెట్టిన “శ్రీదేవి డ్రామా కంపెనీ”లా మారిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో సౌండ్ బాక్స్‌లు, మైక్‌లు పెట్టి పాటలు, సంబరాలతో హోరెత్తించడంతో సమీప వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శబ్ద కాలుష్యాన్ని భరించలేక కొందరు రోగులు అసహనం వ్యక్తం చేయగా, వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

ప్రశాంతమైన వాతావరణం అవసరమైన ఆసుపత్రిలో ఇలాంటి వేడుకలు నిర్వహించడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. “రోగుల ప్రాణాల కంటే సంబరాలకే విలువ ఇస్తున్నారా?” అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.మరోవైపు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ సెలవులో ఉండటంతో, నియంత్రణ లేకుండా కార్యక్రమం సాగిందని సమాచారం. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న సిబ్బంది ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొంతమంది నర్సులు ఆసుపత్రి యూనిఫాంలోనే ఉండటం గమనార్హం. ఈ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# చికెన్ దుకాణాలు బంద్...




**ఖమ్మం జిల్లా పెన్ పవర్:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చికెన్ షాపులు బంద్ చేశారు పౌల్ట్రీ కంపెనీలో మర్జిన్ లు పెంచే వరకు నిరవారిక బంద్ పాటిస్తామని చికెన్ షాప్ ఓనర్ అసోసియేషన్ హెచ్చరించింది గతంలో కంటే మార్జిన్ ఇప్పుడు తక్కువగా ఇస్తున్నారని పౌల్ట్రీ వాళ్ళు దుకాణాలకు కిలో కు 26రూ మార్టిన్ ఇచ్చేవారని ఇటీవల 16 రూ తగ్గించారని కేజీ చికెన్ మార్జిన్ 30రూ ఇవ్వాలని డిమాండ్ చేశారు మార్జిన్ పెంచే వరకు బందు కొనసాగుతుందని ప్రస్తుతం చికెన్ విక్రయాలు పై వస్తున్న లాభాలు తక్కువగా ఉండటంతో షాపులు నిర్వహించడం కష్టంగా మారినట్టు తక్కువ మర్జిన్ వల్ల వ్యాపారుల జీవన ఉపాధి సవాలుగా మారింద ని సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగుతుందని దుకాణాల అద్దెలు కరెంటు బిల్లులు పని వారి జీతాలు నీటి ఖర్చులు లాభాలన్నీ పెద్ద వెళు న్నాయని రిటైల్ వ్యాపారస్తుల్ని ఆదుకొని మార్టిన్ పెంచాలని ఈ సందర్భంగా కోరారు, మరోవైపు చికెన్
దుకాణాలు బంద్ కావడంతో హోటళ్లపైన ప్రభావం పడింది

## ఇద్దరు దొంగలను పట్టుకున్న స్థానికులు

**ఖమ్మం పెన్ పవర్:** నేలకొండపల్లి మండలం పైనంపల్లి లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. బ్రహ్మాచారి కుటుంబ సభ్యులు ఆరుబయట నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఇంట్లో కి చొరబడిన నలుగురు దొంగలు యాభై తులాల వెండి, బంగారు చెవి దిద్దులు, సెల్ ఫోన్ చోరీ చేశారు.అలికిడి విని నిద్రలేచిన బాధితుడు కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకుని దొంగలను పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరు దొంగలు దొరకగా మరో ఇద్దరు పరారయ్యారు.పట్టుకున్న దొంగలను నేలకొండపల్లి పోలీసులకు అప్పగించారు.

# సాగర్ రింగు రోడ్డు వద్ద ఆటో డ్రైవర్లు ఆందోళన

**హైదరాబాద్ పెన్ పవర్:** సాగర్ రింగ్ రోడ్డులో ఆటో డ్రైవర్లు అందోళనకు దిగారు. గంటల తరబడి వేచి ఉన్నా గ్యాస్ లభించడం లేదని నిరసన వ్యక్తం చేసారు. ఎల్పీజీ గ్యాస్ కొరతను నిరసిస్తూ హైవేపై ఆటోలను అడ్డంగా నిలిపివేసారు. దాంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేసారు.

# ఐటీ కడితే రేషన్ తీసేస్తారా...

**హైదరాబాద్, ఏప్రిల్ 1 పెన్ పవర్:** : “మీకు రేషన్‌కార్డు ఉందా? ఐటీ రిటర్న్లు ఫైల్ చేశారా? వార్షికాదాయం రూ.6 లక్షల కంటే ఎక్కువ చూపించారా? అయితే మీ కార్డు రద్దవుతుంది”.. ప్రస్తుతం తెలంగాణలోని గ్రామాల్లో ఈ ప్రచారం లబ్ధిదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. స్వయంగా గ్రామ పరిపాలన అధికారులే (జీపీవోలు) ఆదాయపన్ను శాఖ నుంచి వచ్చిన వివరాల ఆధారంగా విచారణ చేస్తుండటంతో ఈ గందరగోళం నెలకొంది. ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటనా రాకపోయినా, క్షేత్రస్థాయిలో విచారణ వేగంగా జరుగుతుండటం చర్చనీయాంశంగా మారింది.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.01 కోట్ల రేషన్ కార్డులు ఉండగా, వీటిపై 3.25 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారు. రేషన్ కార్డు కేవలం బియ్యం కోసమే కాకుండా ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ వంటి అనేక సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా ఉంది. అయితే, తాజాగా ఐటీ రిటర్న్లు దాఖలు చేసిన వారిని లక్ష్యంగా చేసుకుని విచారణ జరుగుతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 30,186 మంది, సిద్దిపేట జిల్లాలో 14,200 మందిపై అధికారులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఖ్య లక్షల్లో ఉంటుందని అంచనా.అయితే, ఆదాయపన్ను చెల్లించేవారికి, కేవలం రిటర్న్లు దాఖలు చేసేవారికి మధ్య స్పష్టమైన తేడా ఉంది. రుణాలు పొందడం కోసం, టీడీఎస్ రీఫండ్ క్లెయిమ్ చేసుకోవడం కోసం చాలామంది తక్కువ ఆదాయం ఉన్నప్పటికీ ఐటీఆర్ ఫైల్ చేస్తుంటారు. చిన్న వ్యాపారులు సైతం యూపీఐ లావాదేవీల వల్ల కట్ అయిన పన్నును తిరిగి పొందడానికి రిటర్న్లు దాఖలు చేస్తారు.

# ఇద్దరు దొంగలను పట్టుకున్న స్థానికులు

**ఖమ్మం పెన్ పవర్:** నేలకొండపల్లి మండలం పైనంపల్లి లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. బ్రహ్మాచారి కుటుంబ సభ్యులు ఆరుబయట నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఇంట్లో కి చొరబడిన నలుగురు దొంగలు యాభై తులాల వెండి, బంగారు చెవి దిద్దులు, సెల్ ఫోన్ చోరీ చేశారు.అలికిడి విని నిద్రలేచిన బాధితుడు కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకుని దొంగలను పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరు దొంగలు దొరకగా మరో ఇద్దరు పరారయ్యారు.పట్టుకున్న దొంగలను నేలకొండపల్లి పోలీసులకు అప్పగించారు.

# తెలుగు రాష్ట్రాల్లో పవర్ ఫుల్ లీడర్స్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాల నాయకులు మరోసారి తమ సత్తా చాటుకు న్నారు. దేశంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించారు. ప్రఖ్యాత జాతీయ దినపత్రిక ఇండియన్ ఎక్స్ప్రెస్ తాజాగా ప్రకటించిన '×జు 100': 2026 పేరుతో అత్యంత శక్తివంతమైన భారతీయుల జాబితాను ప్రకటించింది. అందులో తెలుగు ప్రముఖులకు చోటు దక్కింది. దేశ గమనాన్ని శాసించగల వందమంది ప్రముఖులతో రూపొందించిన ఈ జాబితాలో తెలుగు నేతలకు అగ్రతాంబూలం దక్కడం విశేషం. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ జాబితాలో ఉన్నారు. అందరికంటే మెరుగైన స్థితిలో ఏపీ సీఎం చంద్రబాబు ఉండడం విశేషం.దేశంలో అత్యంత శక్తివంతమైన వ్యక్తులను ఈ జాబితాలో చేర్చారు. అందులో ఏపీ సీఎం చంద్రబాబు 13వ స్థానంలో నిలవడం విశేషం. అత్యంత శక్తివంతమైన తెలుగు నాయకుడిగా ఆయన తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించడం, ఏపీ పునర్నిర్మాణంలో ఆయన చూపుతున్న చొరవ జాతీయ స్థాయిలో సైతం గుర్తింపు పొందింది. ఇక తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారారు సీఎం రేవంత్ రెడ్డి. ఆయన ఈ జాబితాలో 25వ స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీలో రాహుల్ గాంధీ తర్వాత అత్యంత ప్రభావశీలుడైన నేతగా రేవంత్ గుర్తింపు సాధించారు. మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ వంటి సీనియర్లను వెనక్కి నెట్టి రేవంత్ రెడ్డి ఈ జాబితాలో ముందంజలో ఉండడం విశేషం.మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్68వ స్థానంలో నిలిచారు. మరోసారి తన గ్లామర్ ను నిరూపించుకున్నారు. జాతీయస్థాయిలో మంచి నాయకుడిగా గుర్తింపు పొందారు. కేంద్ర మంత్రి గింజరాపు రామ్మోహన్ నాయుడు సైతం 90 స్థానంలో నిలిచారు. కేంద్ర క్యాబినెట్లో తెలుగు రాష్ట్రాల నుంచి యువనేతగా ఎంపికైన ఆయన మంచి వాగ్ధాటితో ముందుకు సాగుతున్నారు. అయితే ఏపీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి ఒక్కరంటే ఒక్క నేతకు కూడా ఈ జాబితాలో స్థానం దక్కకపోవడం విశేషం. ఒకప్పుడు అద్భుత విజయంతో జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు సాధించారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఇప్పుడు అదే స్థాయిలో ఓటమితో దారుణంగా దెబ్బతిన్నారు రాజకీయంగాను. అయితే ఒక జాతీయ పత్రిక ప్రకటించిన జాబితాలో ఆ రెండు పార్టీలకు ఇప్పుడు చోటు దక్కకపోవడం మాత్రం నిజంగా లోటు

# 2027 నాటికి మూమునూరు ఎయిర్ పోర్ట్



**వరంగల్ , ఏప్రిల్ 1, పెన్ పవర్:** హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలోనే ప్రఖ్యాతి పొందింది. అయితే ఇప్పుడు తెలంగాణలోని మరో ఎయిర్ పోర్ట్ నిర్మాణంతో మరోసారి విమాన రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించే అవకాశంఉందని కొందరు అంటున్నారు. వరంగల్ జిల్లా మూమునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సంబంధించి సాంకేతిక సహాయం అందించేందుకు వరంగల్ నీట్ కు ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బాధ్యతలను అప్పగించింది.ఇప్పటికే ఎయిర్పోర్ట్ నిర్మాణానికి సంబంధించి భూ సేకరణను పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయగా.. తదుపరి చర్యల్లో భాగంగా సాంకేతిక సహాయం తో పాటు సూపర్వైజింగ్ చేయాలని ప్రభుత్వం నీట్ ను కోరింది.

దీంతో ఈ ఎయిర్పోర్ట్ పై ఇప్పుడు ఆసక్తిగా చర్చ సాగుతోంది.వరంగల్ జిల్లాలోని మూమునూరు లో ఎయిర్ పోర్టు నిర్మాణానికి రూ. 850 కోట్లు అవసరం ఉండనుంది. ఇందులో ఆధునిక టెర్మినల్ భవనానికి, రహదారిఏర్పాట్లకు, ట్రాఫిక్ కంట్రోల్ తో పాటు ఫైర్ సేఫ్టీ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. మొత్తంగా 2027 చివరి నాటికి ఈ ఎయిర్పోర్ట్ నుంచి విమాన సర్వీసులు ప్రారంభించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసుకుంది. అయితే ఈ ఎయిర్పోర్ట్ నిర్మాణంతో వరంగల్ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని కొందరు అంటున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో ఐటీ సెక్టార్ ఎదిగేందుకు ఆస్కారం ఎక్కువగా ఉందనిచెబుతున్నారు. ఎయిర్పోర్ట్ నిర్మాణంతో ఇక్కడ పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.అలాగే ఇక్కడ మెగా టెక్స్టైల్ పార్క్ కూడా ఏర్పాటు కావడంతో ఇది అంతర్జాతీయంగా కనెక్ట్ అయ్యే అవకాశం ఉందనిఅంటున్నారు. ఇలా పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటుతో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని చెబుతున్నారు. ఉత్తర తెలంగాణలోని ఎయిర్పోర్ట్ ప్రత్యేకంగా నిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది.1930 లా కాలంలో ఈ ఎయిర్

పోర్టును ప్రారంభించారు. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పై అజాం జాహి మిల్స్ వంటి పరిశ్రమల సహాయంగా దీనిని ఏర్పాటు చేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ సైన్యం 1948 ఆపరేషన్ పోలో లో భాగంగా

ఉపయోగించారు. 1959లో జవహర్లాల్ నెహ్రూ కూడా ఇక్కడ దిగినట్లు చరిత్ర తెలుపుతుంది. ఈ ఎయిర్పోర్టు పునరుద్ధరణకు 2025లో కేంద్రం ఆమోదం తెలిపింది. మొత్తం 950 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ ఎయిర్పోర్టులోదేశీయ విమాన సేవలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

# నిర్లక్ష్య డ్రైవింగే ప్రమాదాలకు కారణం

**ఖమ్మం పెన్ పవర్:** నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడమే కారణంగానే ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. నేలకొండపల్లి పోలీసుల ఆధ్వర్యంలో ప్రజాపాలన,ప్రగతి ప్రణాలిక లో భాగంగా రోడ్డు భద్రత అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి కమీషనర్ సునీల్ దత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిమీద వెళ్లే కుటుంబ సభ్యులు జాగ్రత్తగా రమ్మని ప్రతి ఒక్కరూ సూచించాలన్నారు.లైసెన్స్, హెల్మెట్ లేకుండానే యువకులు డ్రైవింగ్ చేస్తున్నారన్నారు,ఎక్కువ ప్రమాదాలు జరగడానికి కారణం నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడమే కారణమని ఆయన తెలిపారు.ప్రమాదం జరిగినప్పుడు తోటి వారు వెంటనే స్పందించాలని ఆయన అన్నారు.పోలీసులు ఫైన్ వేసేది ప్రజల జీవిత భద్రత గురించే అని ఆయన తెలిపారు.ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోవద్దని ఆయన అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ప్రయాణికులకు గాయాలు

**ఆదిలాబాద్ పెన్ పవర్:**
ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద జాతీయ రహదారిపై చంద్రపూర్ మహంకాళి దర్శనం కోసం 25 మంది భక్తులతో వెళ్తున్న ఐచర్ వాహనాన్ని లారీ వెనుక నుండి ఢీకొట్టింది... ప్రమాదంలో

ఐచర్ వాహనంలో ప్రయాణిస్తున్న 10 మందికి గాయాల య్యాయి.. క్షతగాత్రులను ఆదిలాబాద్ రిమ్స్ కు తరలించారు... అయితే గుడిహత్నూర్ మండలంలో జాతీయ రహదారిపై అత్యధిక ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ లో



ప్రమాదాలను తగ్గించటానికి పెద్ద మొత్తంలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు వివాదాస్పదం అవుతుంది... మేకలగండి నుండి సీతగొంది వరకు 15 వరకు ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదాలను తగ్గించడం ఏమిటో కానీ మరిన్ని ప్రమాదాలు జరిగేందుకు ఊతమిస్తున్నాయి అని జనం వాపోతున్నారు... స్పీడ్ బ్రేకర్ల వద్ద చిన్న వాహనాలు వేగాన్ని తగ్గిస్తుండగా , స్పీడ్ బ్రేకర్లను పట్టించుకుని పెద్ద వాహనాలు వేగాన్ని తగ్గించిన వాహనాలను వెనుక

నుండి ఢీకొడుతున్నాయని , దీంతో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు స్థానికులు...

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మళ్లీ వాటర్ వార్...

**హైదరాబాద్, కర్నూలు, ఏప్రిల్ 1, పెన్ పవర్:**
వాటర్ వార్. ఏపీ, తెలంగాణ మధ్య ఇది తెగని పంచాయితీ. ఒడవని లొల్లి. ప్రతీ ఏడాది ఒకటి రెండుసార్లు అయినా..నీళ్ల రగడ రచ్చ చేయడం కామన్. పైగా శ్రీశైలం డ్యామ్ నీళ్ల వివాదం మాత్రం నెక్ట్స్ లెవల్. రెండు రాష్ట్రాల బార్డర్లో ఉన్న శ్రీశైలం డ్యామ్ విషయంలో..ఏదో పేచీ ఉండనే ఉంటుంది. అయితే మీడియా ప్రకటనలు, లేఖలు రాసి నిరసనలు తెలుపుతూ వచ్చిన తెలంగాణ లీడర్లు ఈసారి ఓ అడుగు ముందుకేశారు. ఏకంగా శ్రీశైలం ప్రాజెక్టు మీద ధర్నా చేసేందుకు రెడీ కాగా..ఏపీ సర్కార్ విద్యుత్ ఉత్పత్తిని నిలిపేయడంతో వాటర్ వార్ కాస్త చల్లబడింది. శ్రీశైలం ప్రాజెక్టు వివాదాలకు కేరాఫ్గా ఎందుకు మారింది? ఇంత జరుగుతున్న ఖ=వీదీ ఎందుకు సైలెంట్గా ఉన్నట్లు?ఆంధ్రప్రదేశ్ పర్యాటకంరెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీళ్ల లొల్లి మరోసారి వివాదాన్ని రాజేసింది. కృష్ణా జలాల విషయంలో ఏపీ తీరుపై తెలంగాణ ఎమ్మెల్యేలు కన్నెర్ర చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో వాటర్ డెడ్ స్టోరేజ్ కు పడిపోయినా..ఏపీ విద్యుత్ ఉత్పత్తి చేయడంపై తెలంగాణ లీడర్లు గుర్రుగా ఉన్నారు. ప్రతీసారి కేంద్రానికి, ఖ=వీదీకి లేఖల ద్వారా ఫిర్యాదు చేసే తెలంగాణ..ఈ సారి కాస్త సీరియస్గా రియాక్ట్ అయింది. ఏపీతో అమీతుమీ తేల్చుకునేందుకు ఏకంగా శ్రీశైలం ప్రాజెక్టు దగ్గర ధర్నా చేసేందుకు రెడీ అయ్యారు నేతలు. లాస్ట్ మినిట్లో ఏపీ సర్కార్ విద్యుత్ ఉత్పత్తిని నిలిపేయడంతో..తెలంగాణ నేతలు ధర్నా ఆలోచనను విరమించుకున్నారు.కృష్ణా జలాల విషయంలో ఏపీ, తెలంగాణ మధ్య ఎప్పటినుంచో వివాదం నడుస్తూనే ఉంది. రాష్ట్ర విభజన నాటి నుంచి వాటర్ వార్ ఇంకో టర్న్ తీసుకుంది. రాష్ట్ర విభజన సందర్భంగా కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు తాత్కాలిక కేటాయింపులు చేశారు. 811 టీఎంసీల నికర జలాలలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చేశారు. 2014లో తాత్కాలిక కేటాయింపులు చేసినా..ఇప్పటికీ అవే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 43 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్టు మొత్తం 885 అడుగులు ఉంటే..ప్రస్తుతం 824 అడుగులకు నీటిమట్టం పడిపోయింది. ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజ్కు పడిపోయింది.డెడ్ స్టోరేజ్కు దగ్గరపడితే..సమ్మర్లో తాగునీటి అవసరాలకు మాత్రమే వాడుకోవాలని..ఉమ్మడి రాష్ట్రంలోనే ఒక నిర్ణయం తీసుకుని


దాని ప్రకారమే నడుచుకుంటున్నారు. జీవో కాని ఈ కండీషన్ను ఖతం పట్టించి..ఏపీ కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఎడమగట్టు నుంచి తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిని నిలిపేసినా..ఏపీ మాత్రం కుడివైపు నుంచి కంటిన్యూ చేస్తోంది. ఇలాగే చేస్తే మునుముందు ఇబ్బందులు తప్పవని..ఉమ్మడి పాలమూరు జిల్లా నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం విద్యుత్శాఖను నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..ఏపీ ప్రభుత్వ పెద్దలకు ఫోన్ చేసి చెప్పారు. కానీ ఏపీ అలాగే విద్యుత్ ఉత్పత్తి చేయడంతో.. ఉమ్మడి పాలమూరు నేతలు ఆందోళన బాట పట్టాలని డిసైడ్ అయ్యారు.శ్రీశైలం నుంచి ఏపీ అలాగే విద్యుత్ ఉత్పత్తి చేస్తే..కల్వకుర్తి ఆయకట్టుకు నీరు ఆగిపోయే ప్రమాదం ఉంది. యాసంగి పంట చివరి దశకు వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు నీరు ఇవ్వకపోతే..రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కనీసం 15 రోజుల పాటు కల్వకుర్తి ఆయకట్టుకు నీరు అందించాలంటే.. ఏపీ విద్యుత్ ఉత్పత్తిని నిలిపేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం తరఫున చేసిన వినతికి ఏ మాత్రం స్పందించకపోవడంతో..ఏకంగా శ్రీశైలం ప్రాజెక్టు దగ్గరే ఆందోళన చేయాలని డిసైడ్ అయ్యారు. ఏకంగా మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి, మేఘారెడ్డి, రాజేశ్ రెడ్డిలు శ్రీశైలం డ్యామ్ మీద ధర్నా చేయాలని నిర్ణయించారు. చివరి నిమిషంలో ఏపీ విద్యుత్ నిలిపేయడంతో ఆందోళనను విరమించుకున్నారు. ఈ పరిస్థితి మరోసారి పునరావృతం అయితే..డ్యామ్ పైన వంటవార్పు చేస్తామని హెచ్చరించారు.అయితే ఏపీ, తెలంగాణ మధ్య నీళ్ల వివాదం ధర్నాలకు వెళ్తున్నా.. వివాదాలను అదుపు చేయాల్సిన కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు సైలెంట్ గా ఉండటం చర్చనీయాంశంగా మారింది. శ్రీశైలం ప్రాజెక్టులో డెడ్ స్టోరేజ్ కు పడిపోయినా..ఏపీ విద్యుత్ ఉత్పత్తి చేస్తుంటే ఖ=వీదీ చూస్తూ ఉండిపోయిందని తెలంగాణ నేతలు ఫైర్ అవుతున్నారు. అందుకే ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు స్వయంగా రంగంలోకి దిగారు. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్ విషయంలో కృష్ణా బోర్డు ఇకనైనా నిబంధనలు పాటించేలా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. బోర్డు ఇలాగే మౌనంగా ఉంటే..తమదైన శైలిలో ఆందోళన బాటపడుతామంటూ పాలమూరు జిల్లా నేతలు గట్టి ఇండికేషన్ ఇచ్చారు. ఈ నీళ్ల లొల్లి ఎప్పుడు తెగుతుందో? కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు పంచాయితీని తెంపుతుందో లేదో చూడాలి మరి.

# టార్గెట్ కౌశిక్ రెడ్డి... బిగుస్తున్న ఉచ్చు

**కరీంనగర్, ఏప్రిల్ 1, పెన్ పవర్:**
కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై వివాదాస్పద, మతపరమైన వ్యాఖ్యలు చేసిన కేసులో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 4న విచారణకు రావాలని ఆదేశించింది. ఈ నోటీసులపై స్పందించిన కౌశిక్ రెడ్డి.. ఇది రాజకీయ కక్ష సాధింపు అని తన కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడం సరికాదని రేవంత్ సర్కార్పై మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని.. ప్రజల తరఫున తన పోరాటం ఆపనని ఆయన స్పష్టం చేశారు.హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి చిక్కులు తప్పటం లేదు. ఇప్పటికే అసెంబ్లీలో కడియం శ్రీహరిని బెదిరించారన్న ఆరోపణలతో ఆయనపై చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. తాజాగా.. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు జారీ చేసింది. వచ్చే నెల ఏప్రిల్ 4న హైదరాబాద్లోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 29న వీణవంక మండలంలో జరిగిన మినీ మేడారం జాతర సందర్భంగా బందోబస్తులో ఉన్న పోలీసులకు, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు తనను, తన కుటుంబాన్ని జాతర వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారని కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను ఉద్దేశించి ఆయన

మతంపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఈ కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఈ క్రమంలోనే సీఐడీ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేసారు. ఏప్రిల్ 4న జరిగే



విచారణలో కౌశిక్ రెడ్డి వివరణ తీసుకోనున్నారు. గత కొంతకాలంగా అధికార పక్షంపై నిప్పులు చెరుగుతున్న కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు రావడం రాజకీయంగా హాట్ టాపిక్గా మారింది. ఇది కక్షపూరిత చర్య అని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని అంటోంది.ఈ నోటీసులపై పాడి కౌశిక్ రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. ప్రశ్నించే గొంతును అణచలేరని.. ప్రజల కోసం తన పోరాటం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. ఏ తప్పు చేయకపోయినా నోటీసులు పంపారని.. ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. తాను వెనక్కి తగ్గేది లేదని ట్వీట్ చేశారు. 'ఏ తప్పు చేయకపోయినా ఏదో ఒక విధంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో నాకు, నా కుటుంబానికి, మా దీ=ా కుటుంబ సభ్యులకు జ×ణ నోటీసులు ఇవ్వడం ఎంతో బాధ కలిగించింది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కారణంతో నా కుటుంబ సభ్యులను ,మా దీ=ా కుటుంబ సభ్యులను ఇలా బెదిరింపులకు గురిచేయడం తగునా? రాజకీయాలు నాపై చేయండి.. కానీ నా కుటుంబాన్ని, మా దీ=ా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయం?రేవంత్ రెడ్డి గారు.. నన్ను లక్ష్యంగా చేసుకోండి.. నాపై కేసులు పెట్టండి.. నాకు నోటీసులు ఇవ్వండి.. కానీ నా కుటుంబాన్ని,నా BRS కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టడం మాత్రం బాధాకరం. అయినా సరే.. నన్ను ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. నేను వెనక్కి తగ్గను. మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు.. ప్రజల తరఫున మిమ్మల్ని ప్రశ్నిస్తూనే ఉంటాను. నిలదీస్తూనే ఉంటాను. ఇది నా వ్యక్తిగత పోరాటం కాదు. ప్రజల కోసం చేసే బాధ్యత. ప్రశ్నించే గొంతును అణచలేరు..ప్రజల కోసం నా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది.' అని కౌశిక్ రెడ్డి ట్వీట్ చేశారు.

# జనసేనలోకి వంగా గీత

**కాకినాడ, ఏప్రిల్ 1, పెన్ పవర్:**
రాష్ట్ర రాజకీయాల్లో పిఠాపురం నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం. గత ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ఈ నియోజకవర్గ నుంచి పోటీ చేసిన తర్వాత దీని ప్రాధాన్యం పెరిగింది. గత కొంతకాలంగా ఇక్కడ కూటమి దూకుడుగా ఉంది. రాష్ట్ర డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తుండడంతో అభివృద్ధి సైతం పరుగులు పెడుతోంది. ఇంకోవైపు టిడిపి ఇన్చార్జిగా మాజీ ఎమ్మెల్యే వర్మ ఉన్నారు. కూటమిపై రకరకాల అభిప్రాయాలు ఉన్న ఇక్కడ మాత్రం బలంగానే ఉంది. ఈ తరుణంలో ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు తగ్గాయి. ఆ పార్టీ క్యాడర్లో నిరుత్సాహం అలుముకుంది. పవన్ పై వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వంగా గీత ఇప్పుడు పెద్దగా యాక్టివ్ గా లేరు. ఆ నియోజకవర్గంలో వైసిపి గెలిచే ఛాన్స్ లేదని తెలిసి ఆమె పూర్తిగా సైడ్ అయినట్లు ప్రచారం నడుస్తోంది. జగన్మోహన్ రెడ్డికి సైతం తాను అక్కడ పని చేయలేనని క్లియర్ కట్ గా చెప్పినట్లు సమాచారం.మొన్నటి ఎన్నికల్లో కాకినాడ ఎంపీగా ఉన్న వంగా గీతను తీసుకొచ్చి పిఠాపురంలో పోటీ చేయించారు. మహిళ నేతకు కావడంతోపాటు గతంలో పిఠాపురం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించడంతో ఆమె వైపు మొగ్గు చూపారు. ఆపై ముద్రగడ పద్మనాభం సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఇచ్చేది పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు. దీంతో ఊరు హోరాహోరీగా ఉంటుందని అంతా భావించారు. కానీ అటువంటి పరిస్థితి లేదు. ఏకంగా 70000 ఓట్లకు పైగా మెజారిటీతో గెలిచారు పవన్ కళ్యాణ్. గెలిచిన తరువాత మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ నియోజకవర్గం వర్గాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్నారు. అక్కడి ప్రజలు పవన్ కళ్యాణ్ పనితీరు పట్ల సంతృప్తిగా ఉన్నారని కూడా తెలుస్తోంది. మరోవైపు వైయస్సార్





కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ధైర్యం చెప్పే నేతలు లేకుండా పోయారు. రాష్ట్రస్థాయి విషయాలు మాట్లాడేందుకే అన్నట్టు ముద్రగడ పద్మనాభం పరిస్థితి ఉంది. వంగా గీత సైతం పార్టీ శ్రేణులకు పెద్దగా ప్రయారిటీ ఇవ్వడం లేదు. స్థానికంగా కూడా అందుబాటులో లేరని తెలుస్తోంది. కొద్దిరోజుల కిందట జగన్మోహన్ రెడ్డి వంగా గీతను పిలిచి మాట్లాడారట. పిఠాపురం నియోజకవర్గంలో యాక్టివ్ కావాలని సూచించారట. అందుకు ఆమె అంగీకరించలేదట. పవన్ కళ్యాణ్ ఉండగా పిఠాపురం నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ గెలిచే పొజిషన్లో లేదని.. అందుకే తాను నియోజకవర్గ ఇన్చార్జి పోస్టును తీసుకోలేనని ఆమె తేల్చి చెప్పారట. తెలుగుదేశం పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన వంగా గీత ప్రజారాజ్యం పార్టీలో కూడా పనిచేశారు. అందుకే ఆమె విషయంలో

పవన్ కళ్యాణ్ సైతం గౌరవంగానే మెలిగారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఆమెను జనసేనలో చేర్చుకుంటామని కూడా బాహటంగానే చెప్పారు పవన్. అయితే ఇప్పుడు వంగా గీత వ్యవహార శైలి చూస్తుంటే ఆమె జనసేనకు దగ్గరవుతారా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో..


# వైసీపీ కొత్త గేమ్ ప్లాన్



**విజయవాడ, ఏప్రిల్ 1, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు ఒక కొత్త పోరాటం మొదలైంది. అసెంబ్లీలో తగినంత సంఖ్యాబలం లేకపోయినా, అధికార కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు వైఎస్ జగన్ నేతృత్వంలోని వైసీపీ పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తోంది. రాష్ట్ర స్థాయిలో శాసనమండలిని, జాతీయ స్థాయిలో పార్లమెంటును వేదికలుగా చేసుకుని కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే ఈ కొత్త గేమ్ ప్లాన్ అసలు ఉద్దేశంగా కనిపిస్తోంది.అసెంబ్లీలో వైసీపీ బలం తక్కువగా ఉండటంతో, సభా కార్యక్రమాలకు దూరంగా ఉంటోంది వైసీపీ. అయితే శాసనమండలిని మాత్రం వదులుకోవడం లేదు. మండలిలో వైసీపీకి మెజారిటీ ఉండటాన్ని పూర్తిస్థాయిలో అనుకూలంగా మార్చుకుంటోంది. ఇటీవల 15 రోజుల పాటు జరిగిన సమావేశాల్లో వైసీపీ ఎమ్మెల్సీలు ప్రతిరోజూ ప్రభుత్వాన్ని నిలదీశారు.ముఖ్యంగా తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి వ్యవహారం, టీటీడీ నిర్ణయాలు, రైతుల సమస్యలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగ భర్తీ వంటి అంశాలపై వైసీపీ గట్టిగా పోరాడింది. లడ్డూ వివాదంపై చర్చ జరగాల్సిందేనని పట్టుబట్టి, వరుసగా వాయిదా తీర్మానాలు ఇచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. చివరకు ప్రభుత్వం పూర్తిస్థాయి చర్చకు సిద్ధం కాకపోయినా, కనీసం స్టేట్‌మెంట్ ఇచ్చేలా చేయగలిగింది. దీన్ని వైసీపీ నేతలు తమ నైతిక విజయంగా చెప్పుకుంటున్నారు. మండలిలో ఉన్న బలాన్ని వాడుకుంటూ అధికార పక్షాన్ని సమాధానం చెప్పాల్సిన పరిస్థితికి నెట్టడంలో వారు సఫలమవుతున్నారు.అదే సమయంలో రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో పార్లమెంట్ వేదికను వైసీపీ వ్యూహాత్మకంగా వాడుకుంటోంది. వైసీపీ ఎంపీలు పార్లమెంట్‌లో గళం విప్పుతున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ దాడులు, శాంతిభద్రతల సమస్యలు, అమరావతి అప్పుల అంశాలను వారు ఢిల్లీ వేదికగా ఎండగడుతున్నారు.ఈ వ్యూహంలో భాగంగానే అనంతపురం జిల్లాకు చెందిన ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థకు విదేశీ నిధుల వెసులుబాటు కల్పించడంలో వైసీపీ చేసిన పోరాటం ఫలితాన్ని ఇచ్చిందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి తిరిగి అనుమతులు ఇవ్వడం తమ విజయమేనని వారు ఘంటాపథంగా చెబుతున్నారు.అసెంబ్లీని స్కిప్ చేసినా.. మండలి, పార్లమెంట్ ద్వారా తమ వాయిస్‌ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వైసీపీ భావిస్తోంది. ఒకవైపు రాష్ట్రంలో ఎమ్మెల్సీలు, మరోవైపు ఢిల్లీలో ఎంపీలు సమాంతరంగా పోరాటం చేస్తుండటంతో కూటమి సర్కార్ రక్షణలో పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ డ్యూయల్ స్ట్రాటజీ ద్వారా వైసీపీ తన ఉనికిని చాటుకోవడమే కాకుండా, కూటమి వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచగలుగుతోంది

# నిఘా కళ్లలో అమరావతి

**గుంటూరు, ఏప్రిల్ 1, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. రాజధాని నగర పరిధిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తూ గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కీలక ప్రకటన విడుదల చేశారు. రాజధాని ప్రాంతంలో ఇటీవల జరుగుతున్న కొన్ని అవాంఛనీయ ఘటనలు, అమరావతి నిర్మాణం తిరిగి ఊపందుకుంటున్న వేళ విద్రోహక శక్తులు తలదూర్చకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ హై అలర్ట్ ప్రకటించినట్టు తెలుస్తోంది. ఈ భద్రతా వ్యూహంలో భాగంగా తక్షణమే అమలులోకి వచ్చేలా ఆరు ప్రధాన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కేవలం పగటిపూట మాత్రమే కాకుండా రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం ఈ కొత్త ప్రోటోకాల్ ప్రధాన ఉద్దేశం. రాజధాని లోపలికి వచ్చే, బయటకు వెళ్లే ప్రతి వాహనాన్ని తనిఖీ చేసేందుకు 6 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. దీని వల్ల అనుమానితుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. ఆధునిక సాంకేతికతను జోడించి, రాత్రి సమయాల్లో క్షేత్రస్థాయిలో పోలీసులు వెళ్లలేని ప్రాంతాలను సైతం గమనించేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఈ డ్రోన్ కెమెరాలు నిరంతరం ఆకాశం నుంచి నిఘా వేసి, అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే కంట్రోల్ రూమ్‌ను అప్రమత్తం చేస్తాయి. పోలీసు వాహనాలు నిరంతరం రాజధాని రహదారులపై గస్తీ తిరుగుతూ ఉంటాయి. ఇది నేరస్తుల్లో భయం కలిగించడమే కాకుండా, స్థానికుల్లో, నిర్మాణ పనుల్లో ఉన్న



కార్మికుల్లో భద్రతా భావాన్ని కల్పిస్తుంది. అమరావతిలో ప్రస్తుతం అనేక నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆయా నిర్మాణ సంస్థలకు ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాజధాని ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత కేవలం పోలీసులదే కాదని, సంబంధిత సంస్థలు కూడా సహకరించాలని పోలీసులు పేర్కొన్నారు.ప్రతి నిర్మాణ ప్రాంగణంలో హైడెఫినిషన్ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

నిర్మాణ సంస్థలు తమ సొంత సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకొని, పగలు, రాత్రి వేళల్లో గస్తీ కాయాలి. నిర్మాణ సమయంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ హెచ్చరించారు.

## పంచాయితీ రాజ్ శాఖకు అవార్డుల పంట

**నెల్లూరు, ఏప్రిల్ 1, పెన్ పవర్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్న్న?న్న పంచాయతీరాజ్ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డులు వరించాయి. రెండు విభాగాల్లో తొలిస్థానంలో నిలిచిన ఏపీ పంచాయతీరాజ్ శాఖ.. ఓ విభాగంలో రెండో స్థానంలో.. మరో రెండు విభాగాల్లో తృతీయ స్థానంలో నిలిచి అవార్డులు గెలుచుకుంది. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, జల్ సంచయ్ –జన్ భాగీదారీ విభాగాల్లో తొలిస్థానంలో నిలిచింది. మొత్తంగా గతంలో 24వ ప్లేసులో ఏపీ పంచాయతీరాజ్ శాఖ .. నేడు దేశంలోనే తొలి స్థానంలో నిలిచిందిడిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీ పంచాయతీరాజ్ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డులు పంట పండింది. ఏపీ పంచాయతీరాజ్ శాఖ జాతీయ స్థాయిలో రెండు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఒక విభాగంలో ద్వితీయ స్థానంలో నిలవగా., మరో రెండు విభాగాల్లో మూడో స్థానంలో నిలిచి అవార్డులు గెలుచుకుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, వివిధ సేవల్లో మెరుగైన పనితీరు ఆధారంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఈ అవార్డులను ప్రకటించింది.రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్, జల్ సంచయ్–జన్ భాగీదారి విభాగంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. గత ప్రభుత్వం హయాంలో 24వ స్థానంలో నిలిచిన ఏపీ పంచాయతీరాజ్ శాఖ.. ఈసారి దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం విశేషం. గ్రామ పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించేలా చేయటం, అలాగే ప్రణాళికబద్ధమైన అభివృద్ధి కోసం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. అలాగే జల్ సంచయ్ – జన్ భాగీదారీ కార్యక్రమం కింద తక్కువ ఖర్చుతో వర్షపు నీటిని నిల్వచేసే పద్ధతులను ప్రోత్సహిస్తారు. ఈ రెండు విభాగాల్లో దేశంలోనే తొలి స్థానంలో ఏపీ పంచాయతీరాజ్ శాఖ నిలిచింది.మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఐదు మంత్రిత్వ శాఖల బాధ్యతలు చూస్తున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణ శాఖ, శాస్త్ర సాంకేతికత శాఖలను పవన్ కళ్యాణ్ పర్యవేక్షిస్తున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా.. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలను పవన్ కళ్యాణ్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా పల్లెపండుగ 1.0, పల్లెపండుగ 2.0 కార్యక్రమాలు చేపట్టారు.అలాగే ఒకేసారి రికార్డు స్థాయిలో గ్రామసభలు నిర్వహించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. గ్రామసభలలో వచ్చిన వినతుల ఆధారంగా పల్లెవెలుగు కార్యక్రమాలు చేపట్టి రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ అవార్డులు కైవసం చేసుకోవటం విశేషం.

## వైసీపీ క్రెడిట్ వార్...



**కడప, ఏప్రిల్ 1, ( పెన్ పవర్:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమై రెండేళ్లు అవుతోంది. కానీ ఇప్పుడు రాష్ట్రంలో ఏ ప్రాజెక్టులు పూర్తయినా.. కొత్తవి వస్తున్నా.. అవి తమ క్రెడిట్ అన్నట్టు వ్యవహరిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. తిరిగి క్రెడిట్ చోరీ అంటూ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతోంది. మొన్నటి వరకు జగన్మోహన్ రెడ్డి తాము చేసింది చెప్పుకోలేదని చెబుతున్నారు. ఇప్పుడు ఇదిగో మేం చేసాం అంటూ కొత్త పల్లవి అందుకుంటున్నారు. తాజాగా శ్రీకాకుళం జిల్లాలో ఛలో మూలపేట పోర్ట్ అంటూ సౌండ్ చేసింది వైసిపి. టెక్కలి నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తున్న ఈ పోర్టు నిర్మాణం తుది దశకు చేరుకుంది. కానీ తమ ప్రభుత్వ హయాంలోనే నిర్మాణం జరిగింది అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కొత్త వాదనను తెస్తోంది. తమ హయాంలోనే 70 శాతం పనులు జరిగాయని.. తమకి క్రెడిట్ ఇవ్వాలని కోరుతోంది. నిన్ననే ఆ పోర్టు వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి వైసిపి నాయకులు గట్టిగానే సౌండ్ చేశారు.2023లో ఈ పోర్టు పనులను ప్రారంభించింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. అక్కడకు ఏడాది కాలంలోనే ఎన్నికలు వచ్చాయి. అయితే తాము దిగిపోయే నాటికి 70% పనులు పూర్తి చేశామని చెబుతోంది ఆ పార్టీ. ఏడాది కాలంలో 70 శాతం పనులు చేస్తే.. ఈ రెండేళ్ల కాలంలో 30% పనులు జరిగాయా అనే ప్రశ్న వినిపిస్తోంది. పైగా వైసీపీ హయాంకంటే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే పనులు వేగవంతం అయ్యాయన్న వాదన ఉంది. కానీ వైసీపీ ఆలోచన అదికాదు. ఈ పోర్టు నిర్మాణంలో తమ పార్టీ ముద్ర ఉండాలని బలంగా కోరుకుంటుంది. పైగా అదనపు భూసేకరణ అనే అంశం తెరపైకి వస్తే దానిని పట్టుకొని పోరాటం చేయాలని చూస్తోంది. తద్వారా టెక్కలి నియోజకవర్గంలో పాటు శ్రీకాకుళం జిల్లాలో పట్టు పెంచుకోవాలని భావిస్తోంది. అందుకే ఉత్తరాంధ్ర నుంచి వైసిపి నేతలంతా ఈ కార్యక్రమానికి కదలి వచ్చారు.ప్రస్తుతం మూలపేట పోర్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. దాదాపు తుది దశకు చేరుకుంటున్నాయి. ఈ ఏడాది నవంబర్ నాటికి నిర్మాణ పనులు పూర్తిచేసి పోర్టు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే నెలలో ట్రయల్ రన్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ సమాచారంతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. సాధారణంగా ఏదైనా ప్రాజెక్టు పూర్తయ్యాక క్రెడిట్ కోసం ప్రయత్నిస్తుంటారు. కానీ ప్రాజెక్టు ప్రారంభానికి ముందే భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం ద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఇది మా వల్లే సాధ్యం అయింది అని ప్రజల్లోకి సంకేతాలు పంపించగలిగింది. అయితే దీనిని కూటమి ధీటుగానే బదులిస్తోంది. ఈ క్రెడిట్ ఆరాటాన్ని ప్రజలు పట్టించుకోరని తేల్చి చెబుతోంది.

## మారనున్న రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు

**విశాఖపట్టణం, ఏప్రిల్ 1, పెన్ పవర్:** లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలని పునర్విభజించాలని.. వాటి సంఖ్య 50శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో.. ఏపీలో భౌగోళికంగా, రాజకీయంగా కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయ్. 50 శాతం సీట్లు పెంచాలని కేంద్రం తీసుకున్న నిర్ణయంతో.. రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల సంఖ్య 263కి పెరుగుతుంది. నియోజకవర్గాల పునర్విభజన కారణంగా.. ఏకంగా 88 అసెంబ్లీ స్థానాలు పెరగడంతో.. యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చట్టసభల్లో మరింత ప్రాతినిధ్యం పెరుగుతుంది. కొత్త నాయకత్వం అభివృద్ధి చెందుతుంది. చదువుకున్న యువత రాజకీయాల్లోకి వచ్చేందుకు ఈ పరిణామం ఉపయోగపడుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్. ఎమ్మెల్యేల సంఖ్య పెరిగితే.. దానికి తగినట్లుగా శాసన మండలిలోనూ సభ్యుల సంఖ్య పెరుగుతుంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉన్నాయ్.నియోజకవర్గాల పునర్విభజన అనేది ఇప్పుడు తీవ్ర ఉత్కంఠకు దారి తీస్తోంది. కొత్తగా 88 నియోజకవర్గాలు ఏర్పాటు చేస్తారనే ప్రచారంతో.. రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయ్. మరీ ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో జరగబోయే మార్పులపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఆయా వర్గాలకు కొత్తగా రిజర్వ్ అయ్యే నియోజకవర్గాలపై.. ఇప్పటి నుంచే లెక్కలు కనిపిస్తున్నాయ్. యాడ్ అయ్యేది ఏంటి.. కోల్పోయేది ఏంటంటూ అంచనాలు వేసుకుంటున్నారు మరికొందరు నేతలు. ప్రస్తుతం చట్టసభల్లో ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ఏపీలో 175 అసెంబ్లీ స్థానాల్లో.. మొత్తం 36 ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాలుగా ప్రకటించారు. ఇందులో 29 ఎస్సీలకు.. 7ఎస్టీలకు రిజర్వ్ చేశారు. ఐతే ఇప్పుడు డీలిమిటేషన్‌తో నియోజకవర్గాలు పెరిగితే.. రిజర్వ్‌డ్ స్థానాలు కూడా పెరుగుతాయ్.ఏపీలో మొత్తం అసెంబ్లీ స్థానాలు 263కు చేరితే.. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలు కూడా రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ చట్ట ప్రకారం.. డీలిమిటేషన్ తర్వాత.. ఎస్సీలకు దాదాపు 45 స్థానాలు.. ఎస్టీలకు 12 స్థానాలు రిజర్వ్ అయ్యే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్. ప్రస్తుతం ఎస్సీలకు రిజర్వు చేసిన స్థానాలు.. దాదాపు ప్రతి జిల్లాలో ఉండగా.. గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రెండేసి స్థానాలు కేటాయించారు. ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాలు ఎక్కువగా ఉత్తరాంధ్రకే పరిమితం చేశారు. పోలవరం జిల్లా పరిధిలోని రంపచోడవరం తప్ప.. మిగిలిన ఆరు ఎస్టీ నియోజకవర్గాలు ఉత్తరాంధ్రలోని పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లా పరిధిలోనే ఉన్నాయ్. ఇక అరకు పార్లమెంటు నియోజకవర్గానికి ఎస్టీలకు కేటాయించారు. ఐతే ఇప్పుడు డీలిమిటేషన్ ప్రతిపాదనలతో.. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో భారీ మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయ్.ఆంధ్రప్రదేశ్ పర్యాటకంఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలను ఆశిస్తున్న వాళ్లు.. ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్న వాళ్లు.. డీలిమిటేషన్ పరిణామాలతో తీవ్ర ఉత్కంఠ అనుభవిస్తున్న పరిస్థితి. కొత్తగా 88 స్థానాలు రాబోతుండడంతో.. నియోజకవర్గాల ముఖచిత్రం పూర్తిగా మారిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో నేతలు తమ అనువైన నియోజకవర్గాల ఏర్పాటు కోసం లెక్కలు వేసుకుంటున్నారు. తమకు పట్టున్న ప్రాంతాలను రిజర్వేషన్ కేటగిరీలో పెట్టడాన్ని జీర్ణించుకోలేకపోతున్న కొందరు సీనియర్ నేతలు.. ఇప్పుడు తమ నియోజవర్గాన్ని రిజర్వేషన్ కేటగిరీ నుంచి తప్పించి జనరల్ చేసుకోవాలని.. ముందు నుంచే పావులు కదుపుతున్నారట. ఏమైనా.. నియోజకవర్గాల పునర్విభజన మొదలైతే.. రాబోయే రోజుల్లో రాజకీయం సరికొత్త మలుపులు తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## భార్యకు విపరీతమైన శృంగార కోరికలు.. టార్చర్ తట్టుకోలేక భర్త పోలీసులకు ఫిర్యాదు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ బెంగళూరు ఉదంతం సామాజిక విలువలపై ముఖ్యంగా వైవాహిక బంధాల్లో 'సమ్మతి' అనే అంశంపై సరికొత్త చర్చను లేవనెత్తింది. సాధారణంగా గృహహింస లేదా వేధింపుల కేసుల్లో బాధితులుగా మహిళలు ఉండటం చూస్తుంటాం. కానీ, ఇక్కడ భర్తే బాధితుడిగా మారి పోలీసులను ఆశ్రయించడం విశేషం.బెంగళూరు నగరంలో వెలుగులోకి వచ్చిన ఈ అరుదైన కేసు ఇప్పుడు సోషల్ మీడియాలో, సామాజిక వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తన భార్య తనను నిరంతరం శారీరక శృంగారం కోసం వేధిస్తోందని.. ఆమె పెడుతున్న ఒత్తిడి భరించలేకపోతున్నానని ఒక వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం సదరు భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా ఈ విషయంలో వివాదాలు నడుస్తున్నాయి. బాధిత భర్త తన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు విస్మయం కలిగిస్తున్నాయి. తాను ఆఫీసులో ముఖ్యమైన పనుల్లో ఉన్న సమయంలో కూడా భార్య నిరంతరం ఫోన్ కాల్స్ చేస్తూ అసభ్యకరమైన సందేశాలను, వీడియోలను పంపుతూ తనను ఇబ్బంది పెడుతోందని అతను ఆరోపించాడు. ఇంటికి వచ్చిన తర్వాత కూడా విశ్రాంతి లేకుండా శారీరక సంబంధం కోసం ఆమె ఒత్తిడి తెస్తోందని.. నిరాకరిస్తే గొడవ పడుతోందని పేర్కొన్నాడు. ఈ నిరంతర వేధింపుల వల్ల తాను మానసిక ఆందోళనకు గురవుతున్నానని, వృత్తిపరమైన బాధ్యతలను సక్రమంగా నిర్వహించలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని, సదరు మహిళను విచారించే పనిలో పడ్డారు. ఇది కేవలం ఒక వ్యక్తిగత గొడవలా కాకుండా వైవాహిక హక్కులు,వ్యక్తిగత స్వేచ్ఛ మధ్య ఉన్న సన్నని గీతను ప్రశ్నిస్తోంది.

**పురుషులకే అధిక కోరిక ఉంటుందనేది అపోహేనా?**

సాధారణంగా సమాజంలో ఒక బలమైన నమ్మకం ఉంది. లైంగిక వాంఛలు పురుషుల్లోనే ఎక్కువగా ఉంటాయని. కానీ నిపుణులు దీనిని ఖండిస్తున్నారు. స్త్రీ పురుషులిద్దరిలోనూ టెస్టోస్టెరాన్ వంటి హార్మోన్లు లైంగిక వాంఛను ప్రభావితం చేస్తాయి. కొందరిలో ఇవి సహజంగానే ఎక్కువగా ఉండవచ్చు. ఒత్తిడి, జీవనశైలి, తీసుకునే ఆహారం, వారు చూసే డిజిటల్ కంటెంట్ వంటివి వ్యక్తిగత కోరికలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. లైంగిక కోరికలు ఉండటం తప్పు కాదు, కానీ భాగస్వామి యొక్క శారీరక, మానసిక స్థితిని అర్థం చేసుకోకుండా ప్రవర్తించడమే సమస్యకు మూలమవుతోంది.

**వైవాహిక బంధంలో 'సమ్మతి' ప్రాధాన్యత**

చట్టపరంగా లేదా సామాజికంగా వివాహం అంటే భాగస్వామిపై సర్వహక్కులు లభించినట్లు కాదు. ఈ కేసు మనకు కొన్ని కీలక పాఠాలను నేర్పుతోంది. ఏ బంధమైనా పరస్పర గౌరవం మీద ఆధారపడి ఉండాలి. ఒకరికి ఇష్టం లేనప్పుడు బలవంతం చేయడం.. అది ఏ రూపంలో ఉన్నా వేధింపుల కిందకే వస్తుంది. భార్యాభర్తల మధ్య తమ అవసరాలు.. ఇబ్బందుల గురించి బహిరంగంగా మాట్లాడుకునే వాతావరణం ఉండాలి. పెళ్లైనంత మాత్రాన ఒకరి ప్రైవసీని లేదా వారి ఇష్టాయిష్టాలను గౌరవించకుండా ఉండకూడదు. సమాజం పురుషుల వేధింపులను సీరియస్‌గా తీసుకోవడం ప్రారంభించింది అనడానికి ఈ కేసే నిదర్శనం. వేధింపులకు లింగభేదం లేదని ఈ ఘటన నిరూపిస్తోంది. ఈ బెంగళూరు ఘటన వైవాహిక జీవితాల్లో పెరుగుతున్న విభేదాలకు, మారుతున్న సామాజిక పోకడలకు అద్దం పడుతోంది. కేవలం భౌతిక అవసరాల కోసమే కాకుండా భాగస్వామి యొక్క మానసిక ప్రశాంతతను కూడా దృష్టిలో ఉంచుకున్నప్పుడే ఆ బంధం చిరకాలం నిలుస్తుంది. పోలీసులు ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అయితే సమాజం మాత్రం "సమ్మతి" అనే పదాన్ని బెడ్‌రూమ్ గోడల మధ్య కూడా వర్తింపజేయాల్సిన అవసరం ఉందని గుర్తించాల్సి ఉంది.

## ప్లాస్టిక్‌కు చెక్ పెట్టే ఐడియా ఉందా.. 10 లక్షలు మీవే



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్లాస్టిక్ కాలుష్యం భూమికి ఎంతటి ప్రమాదమో మనందరికీ తెలిసిందే. ఈ సమస్యకు పరిష్కారం చూపే తెలివైన ఆలోచన మీ దగ్గర ఉందా? అయితే కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న BIOPACKATHON 2026' మీకోసమే! భూమిలో త్వరగా కరిగిపోయే సరికొత్త ప్యాకేజింగ్ ఐడియాలను ఇచ్చే వారికి ఏకంగా రూ.10 లక్షల భారీ నగదు బహుమతిని గెలుచుకునే అవకాశం కల్పిస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడుతూనే లక్షాధికారి అయ్యే ఈ గోల్డెన్ ఛాన్స్ అస్సలు వదులుకోవద్దు. పూర్తి వివరాలు ఇవే..

**ఐడియా ఒక్కటే ..లక్షలు సొంతం:**

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణానికి మేలు చేసే సరికొత్త పద్ధతులను కనిపెట్టడమే ఈ పోటీ ప్రధాన ఉద్దేశం. భూమిలో సులభంగా కలిసిపోయే బయో డీగ్రేడబుల్ ప్యాకేజింగ్ వస్తువులను తయారు చేసే ఐడియా మీ దగ్గర ఉంటే, దాన్ని ప్రదర్శించి నగదు సొంతం చేసుకోవచ్చు. ఇందులో మొదటి బహుమతి గెలుచుకున్న వారికి రూ. 10 లక్షలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ. 7 లక్షలు, మరియు మూడో స్థానంలో నిలిచిన వారికి రూ. 5 లక్షల నగదు బహుమతులు అందజేస్తారు. కేవలం డబ్బు మాత్రమే కాదు, ప్రభుత్వ గుర్తింపు కూడా లభిస్తుంది.

**భారీ బహుమతులతో పాటు బంపర్ ఆఫర్:**

ఈ 'బయోప్యాకథాన్ 2026' కేవలం బహుమతులకే పరిమితం కాదు. విజేతలుగా నిలిచిన వారికి ప్రముఖ పరిశ్రమలతో కలిసి పనిచేసే అద్భుతమైన అవకాశం లభిస్తుంది. అంటే మీ ఐడియాను ఒక పెద్ద వ్యాపారంగా మార్చుకోవడానికి ప్రభుత్వం మరియు పెద్ద కంపెనీలు సహకరిస్తాయన్నమాట. మీ దగ్గర ఉన్న చిన్న ఆలోచన రేపు దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ సమస్యకు పెద్ద పరిష్కారంగా మారవచ్చు. యువత, స్టార్టప్స్ మరియు పర్యావరణ ప్రేమికులు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఇదొక గొప్ప వేదిక.

**అప్లై చేసుకోవడం ఎలా?:**

ఈ పోటీలో పాల్గొనాలనుకునే వారు ఏప్రిల్ 24, 2026 లోపు తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్ ద్వారా తమ ఐడియాలను పంపవచ్చు. మీ ఐడియా ఎంత కొత్తగా ఉంది, అది పర్యావరణానికి ఎంతవరకు మేలు చేస్తుంది మరియు దాన్ని తక్కువ ఖర్చుతో ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లవచ్చు అనే అంశాల ఆధారంగా విజేతలను ఎంపిక చేస్తారు. కాబట్టి మీ దగ్గర ఉన్న పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, ఏదైనా క్రియేటివ్ ఆలోచనతో రంగంలోకి దిగండి.

**పర్యావరణ రక్షణలో భాగస్వాములు అవ్వండి:**

ప్లాస్టిక్ మహమ్మారి నుంచి భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఇలాంటి పోటీలు మనలోని సృజనాత్మకతను బయటకు తీయడమే కాకుండా, సమాజానికి మేలు చేసేలా ప్రోత్సహిస్తాయి. ఇక పది లక్షల రూపాయలు గెలుచుకోవడంతో పాటు పర్యావరణ యోధులుగా గుర్తింపు పొందడం నిజంగా గర్వకారణం. ఇంకెందుకు ఆలస్యం? మీ మెదడుకు పదును పెట్టండి, అద్భుతమైన ఐడియాతో ఏప్రిల్ 24 లోపు అప్లై చేసేయండి. విజేతగా నిలిచి లక్షాధికారి అవ్వండి!

# ప్రీమియం పెట్రోల్ బీభత్సంగా పెరిగింది : లీటర్‌కు ఎంతో తెలిస్తే షాక్ అవుతారు..!


**హైదరాబాద్ పెన్ పవర్:** కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే వాహనదారులకు దేశీయ ఆయిల్ కంపెనీలు గట్టి షాక్ ఇచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఇంధన ధరలు మరోసారి పెరిగాయి. ముఖ్యంగా విలాసవంతమైన కార్లు, సూపర్‌బైక్‌లు వాడే వారికి ఈ పెంపు పెను భారంగా మారనుంది. ఎందుకంటే ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తన ప్రీమియం వేరియంట్ పెట్రోల్, డీజిల్ రేట్లను భారీగా పెంచేసింది.

**XP100 పెట్రోల్:**

ఇండియన్ ఆయిల్ తన 'శూ100' ప్రీమియం పెట్రోల్ రేటును ఏకంగా లీటరుకు రూ.11 పెంచింది. దీంతో నిన్నటి వరకు రూ.149గా ఉన్న లీటర్ ధర ఇప్పుడు రూ.160కి చేరింది. 100 ఆక్టేన్ రేటింగ్ కలిగిన ఈ ఇంధనాన్ని ఎక్కువగా మెర్సిడెస్, ఆడి వంటి లగ్జరీ కార్లు.. రేసింగ్ బైక్‌లలో వాడుతుంటారు. ఇంజిన్ లైఫ్ పెంచడానికి, వేగవంతమైన పికప్ కోసం ఈ ప్రీమియం పెట్రోల్‌ను ఉపయోగిస్తారు. తాజా పెంపుతో ధనికుల జేబులకు భారీ చిల్లు పడనుంది.

**డీజిల్ ధరల పెంపు..**

కేవలం పెట్రోల్ మాత్రమే కాకుండా.. ప్రీమియం డీజిల్ వేరియంట్ అయిన 'ఎక్స్‌ట్రా గ్రీన్' రేట్లను కూడా ఇండియన్ ఆయిల్ సంస్థ పెంచింది. లీటరుకు రూ.91.49 నుంచి రూ.92.99కి పెంచారు. అంటే లీటరుపై రూ.1.50 పెరిగింది. ఇది సాధారణ డీజిల్ కంటే తక్కువ కాలుష్యాన్ని విడుదల చేస్తుంది.







**సామాన్యుడిపై ప్రభావం ఎంత..?**

ప్రస్తుతానికి ఈ పెంపు కేవలం ప్రీమియం వేరియంట్లకు మాత్రమే పరిమితమైనప్పటికీ.. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరల హెచ్చుతగ్గులు, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ఆర్థిక విధానాల నేపథ్యంలో సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కమర్షియల్ గ్యాస్ ధరలు పెరగడం, ఇప్పుడు ఇంధన ధరల సెగ తోడవడంతో రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. సో వాహనదారులు ఇకపై రోడ్లపైకి రావాలంటే ఎక్కువ ఖర్చు చేయక తప్పని పరిస్థితి.

# ఏప్రిల్ 1 నుంచి మారిపోయిన 16 రూల్స్.. రైలు టిక్కెట్ రీఫండ్స్ నుంచి ఫాస్ట్‌ట్యాగ్ వరకూ..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ఆర్థిక సంవత్సరంలో సామాన్యుడి జీవితంపై ప్రభావం చూపే కీలక మార్పులు గురించి ఇప్పుడు తెలుసుకుందాం. వంటగది నుంచి టాక్స్ ఫైలింగ్ వరకు మారిన రూల్స్ ఇవే..

1. కమర్షియల్ గ్యాస్ ధరల పెంపు: దేశంలోని ఆయిల్ కంపెనీలు వాణిజ్య అవసరాలకు వాడే కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.218 పెంచాయి. దీనివల్ల ఢిల్లీలో సిలిండర్ ధర రూ.2078.50కు, చెన్నైలో రూ.2246.50కు చేరింది. అయితే డొమెస్టిక్ సిలిండర్ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు.
2. విమాన ప్రయాణం భారం: విమాన ఇంధనం ధరలు రెట్టింపు అయ్యాయి. మెట్రో నగరాల్లో కిలో లీటర్ ఏటీఎఫ్ ధర సుమారు రూ.లక్షా 94వేల నుండి రూ.2లక్షల 14వేల మధ్యకు చేరింది. దీనివల్ల విమాన టికెట్ల ధరలు పెరిగే అవకాశం ఉంది.
3. రైల్వే టికెట్ రద్దు రూల్స్: ట్రైన్ టికెట్ రద్దు చేసుకునే సమయాన్ని రైల్వే కుదించింది. ఇకపై రైలు బయలుదేరడానికి 8 గంటల ముందు మాత్రమే టికెట్ క్యాన్సిల్ చేసుకునే వీలుంటుంది. గతంలో ఇది 4 గంటలుగా ఉండేది. బోర్డింగ్ స్టేషన్ మార్చుకోవడానికి 30 నిమిషాల సమయం ఉంటుంది.
4. ఫాస్ట్‌ట్యాగ్ బాదుడు: నేషనల్ హైవేస్ అథారిటీ ఫాస్టాగ్ వార్షిక పాస్ ధరను 2.5% పెంచింది. అంటే రూ.3వేలుగా ఉన్న పాస్ ధర ఇప్పుడు రూ.3,075లకు పెరిగింది.
5. టోల్ ప్లాజాల వద్ద నో క్యాష్: దేశవ్యాప్తంగా టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను నిలిపివేశారు. కేవలం ఫాస్ట్‌ట్యాగ్ లేదా యూపీఐ ద్వారానే పేమెంట్స్ చేయాల్సి ఉంటుంది.
6. వాహనాల ధరల పెంపు: ఏప్రిల్ 1 నుంచి కార్లు, కమర్షియల్ వాహనాల ధరలు 2% నుంచి 3% పెరిగాయి. పాత బుకింగ్స్ ఉన్నా.. మార్చి 31లోపు బిల్లింగ్ అవ్వకపోతే కొత్త ధరలే చెల్లించాల్సి ఉంటుంది.
7. కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025: ఇకపై 'ఫైనాన్షియల్ ఇయర్', 'అసెస్మెంట్ ఇయర్' అనే పదాలకు బదులుగా "టాక్స్ ఇయర్" అనే పదాన్ని ఉపయోగిస్తారు.
8. సెక్షన్ 87 A కింద ఊరట: కొత్త పన్ను విధానంలో శాలరీడ్ ఉద్యోగులకు రూ.12.75 లక్షల వరకు, ఇతరులకు రూ.12 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది.
9. ఫామ్ 16 స్థానంలో కొత్త ఫామ్స్: గతంలో ఉన్న ఫామ్ 16, 16ఊ స్థానంలో ఫామ్ 130, 131 అందుబాటులోకి వచ్చాయి. ఇవి మరింత వివరణాత్మక సమాచారాన్ని అందిస్తాయి.
10. HRA రూల్స్: ఇంటి అద్దె మినహాయింపు కోసం రెంట్ రసీదులు తప్పనిసరి. ఏడాదికి లక్ష దాటితే యజమాని పాన్ కార్డ్ ఇవ్వాలి. బెంగళూరు, హైదరాబాద్, పూణే, అహ్మదాబాద్ నగరాలను కూడా 50% ఎగ్జెంప్షన్ కేటగిరీలో చేర్చారు.
11. పీఎన్‌బీ విత్‌డ్రా లిమిట్: పంజాబ్ నేషనల్ బ్యాంక్ క్లాసిక్ డెబిట్ కార్డులపై రూ.25వేలు, ప్లాటినం కార్డులపై రూ.50వేలు విత్‌డ్రా పరిమితి విధించింది.
12. ట్రేడింగ్ ఖరీదు: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ పెరిగింది. ఫ్యూచర్స్‌పై 0.05%, ఆప్షన్స్‌పై 0.15% పన్ను వసూలు చేస్తారు.
13. గోల్డ్ బాండ్లపై పన్ను: ఆర్‌బీఐ నుంచి నేరుగా కొన్న సావరిన్ గోల్డ్ బాండ్ల మెచ్యూరిటీపై మాత్రమే పన్ను మినహాయింపు ఉంటుంది. అయితే ఇకపై సెకండరీ మార్కెట్లో కొన్న వాటికి క్యాపిటల్ గెయిన్ టాక్స్ వర్తిస్తుంది.
14. వేతన చట్టం: ఉద్యోగి మొత్తం జీతంలో బేసిక్ శాలరీ కనీసం 50% ఉండాలి. దీనివల్ల చేతికి వచ్చే జీతం తగ్గినా, పీఎఫ్, గ్రాట్యుటీ పెరుగుతాయి.
15. సెటిల్మెంట్ వేగవంతం: ఉద్యోగం వదిలేసిన తర్వాత కంపెనీలు కేవలం 2 పని దినాలలో పూర్తి సెటిల్మెంట్ పూర్తి చేయాలి రాజీనామా చేసిన ఉద్యోగుల విషయంలో.
16. పాన్ కార్డుకు ఆధార్ వద్దు: పాన్ కార్డు దరఖాస్తుకు పుట్టిన తేదీ ధృవీకరణ కోసం ఆధార్ కార్డును ఇకపై పరిగణించరు. బదులుగా బర్త్ సర్టిఫికేట్ లేదా 10వ తరగతి మార్క్స్ షీట్ సమర్పించాలి.

# అమెరికాలో భారతీయుడి నిర్లక్ష్యానికి గర్భవతి బలి: 100 మైళ్ల వేగంతో ఢీకొట్టిన రేంజ్ రోవర్.. 1 మిలియన్...

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో చోటుచేసుకున్న ఒక ఘోర రోడ్డు ప్రమాదం భారతీయులందరినీ తలవంచుకునేలా చేయడమే కాకుండా ఒక నిండు ప్రాణాన్ని, పుట్టబోయే బిడ్డను బలి తీసుకుంది. భారత సంతతికి చెందిన ఒక వ్యక్తి చేసిన మితిమీరిన వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా 17 ఏళ్ల టీనేజ్ గర్భవతి ప్రాణాలు కోల్పోయిన ఈ విషాద ఘటన స్థానికంగా పెను కలకలం సృష్టించింది. ఈ కేసుకు సంబంధించి నిందితుడు తర్సేమ్ సింగ్‌పై అమెరికా న్యాయస్థానం పలు కఠినమైన ఫెలనీ కేసులు నమోదు చేసింది.

**మృత్యు వేగంతో ప్రయాణం**

పోలీసులు..అధికారుల నివేదికల ప్రకారం.. ఈ హృదయవిదారక ఘటన ఫిబ్రవరి నెలలో ఒహాయో రాష్ట్రంలో చోటుచేసుకుంది. నిందితుడు తర్సేమ్ సింగ్ తన ల్యాండ్ రోవర్ రేంజ్ రోవర్ వెలార్ కారులో అత్యంత వేగంగా వెళ్తుండటాన్ని గమనించిన పోలీసులు అతడిని ఆపేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసుల హెచ్చరికలను ఏమాత్రం బేఖాతరు చేయడమే కాకుండా తన వాహన వేగాన్ని మరింత పెంచి తప్పించుకోవడానికి ప్రయత్నించాడు.

ఈ క్రమంలో సుమారు గంటకు 100 మైళ్ల వేగంతో మృత్యువులా దూసుకెళ్లిన అతని కారు, ఎదురుగా వస్తున్న జీప్ చెరోకీ వాహనాన్ని అత్యంత బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు జీప్‌లో ప్రయాణిస్తున్న 17 ఏళ్ల గర్భవతి అష్లీ హోమ్స్ వాహనం నుండి బయటకు ఎగిరిపడింది. తీవ్ర గాయాలైన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా ఆమె గర్భంలోని శిశువు కూడా ఈ లోకాన్ని చూడకుండానే కన్నుమూసింది. ఒకేసారి రెండు ప్రాణాలు గాలిలో కలిసిపోవడంతో బాధితురాలి కుటుంబంలో పెను విషాదం నెలకొంది.



**న్యాయస్థానంలో విచారణ.. బెయిల్**


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తర్సేమ్ సింగ్‌ను అధికారులు మియామీ వ్యాలీ ఆసుపత్రికి ఎయిర్‌లిఫ్ట్ చేసి ప్రాణాపాయం నుంచి తప్పించారు. కోలుకున్న వెంటనే పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ దారుణ ఘటనపై అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తీవ్రంగా స్పందించింది. ఒక వ్యక్తి నిర్లక్ష్యం వల్ల అమాయక ప్రాణాలు పోవడంపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ప్రస్తుతం కోర్టు ఈ కేసు విచారణను ఏప్రిల్ 3కు వాయిదా వేసింది. నిందితుడికి 1 మిలియన్ డాలర్ల (సుమారు 8.3 కోట్ల రూపాయలు) భారీ బెయిల్ మొత్తాన్ని కోర్టు నిర్ణయించింది. అయితే తర్సేమ్ సింగ్ తాను ఏ తప్పూ చేయలేదని 'నాట్ గిల్టీ' అని వాదిస్తుండటం గమనార్హం.

**ముంచుకొస్తున్న బహిష్కరణ గండం**

తర్సేమ్ సింగ్‌పై క్రిమినల్ కేసులతో పాటు ఇమ్మిగ్రేషన్ డిటైనర్ కూడా విధించబడింది. అంటే ఒకవేళ కోర్టులో అతడు దోషిగా తేలి, జైలు శిక్ష అనుభవించిన తర్వాత అతడిని అమెరికా నుండి శాశ్వతంగా బహిష్కరించి, స్వదేశానికి పంపించే అవకాశం ఉంది.

విదేశాల్లో నివసించే భారతీయులు ఆ దేశ ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే అది కేవలం జరిమానాలతో ముగియదు. ఇలాంటి తీవ్రమైన ప్రమాదాలు జరిగినప్పుడు వారి కెరీర్, వీసా హోదా , వ్యక్తిగత జీవితం సర్వనాశనం అవుతాయని ఈ ఘటన మరోసారి హెచ్చరిస్తోంది. ఈ ఘటన అమెరికాలో రోడ్డు భద్రతపై అతి వేగం వల్ల కలిగే పరిణామాలపై పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. అమాయక బాలిక మృతికి న్యాయం జరగాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులు సైతం వాహనదారులు వేగ పరిమితిని పాటించాలని లేని పక్షంలో ఇలాంటి మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

# మ్యాచ్ తర్వాత స్టేడియం క్లీన్ చేసిన జపాన్ ఫ్యాన్స్.. మనమైతే ఏం చేసే వాళ్లం..?



క్రికెట్ లేదా ఫుట్ బాల్ మ్యాచ్ లు చూసేందుకు స్టేడియాలకు వెళుతుంటాం కదా. మ్యాచ్ జరుగుతుండగా ఏం చేస్తాం. మనం సపోర్ట్ చేస్తున్న టీమ్ కోసం గొంతు చించుకునేలా అరుస్తాం.. పేపర్లు చింపేసి వెదజల్లుతాం.. ఇంకా నానా అల్లరి, హంగామా చేస్తాం కదా. మ్యాచ్ పూర్తయ్యాక ఏం చేస్తాం.. చిప్స్ పాకెట్స్ కవర్స్, కోక్స్ ఎంప్టీ బాటిల్స్.. వగైరా అన్నీ సీట్లపైనా, స్టేడియం అంతటా వదిలేసి వస్తుంటాం కదా.

కానీ జపాన్ ఫ్యాన్స్ కూడా మనలాగే మ్యాచ్ ఎంజాయ్ చేశారు. అల్లరి చేశారు. విజిల్స్ వేశారు.. తమ టీమ్ కు ఫుల్ సపోర్ట్ చేశారు. మ్యాచ్ పూర్తయ్యాక తమ టీమ్ గెలిచిందనే గర్వం లేకుండా స్టేడియం మొత్తం క్లీన్ చేసి ప్రపంచంలోని కోట్లాది మంది హృదయాలను దోచుకున్నారు. ఈ న్యూస్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మనం ఎలాగో చేయం.. కనీసం వాళ్ల డెడికేషన్ ఏంటో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

**హృదయాలను కదిలించిన ఆరేళ్ల పాప:**

2026, మార్చి 31న ఇంగ్లండ్ లోని వెంబ్లీ స్టేడియంలో ఫుట్ బాల్ మ్యాచ్ జరిగింది. ఇంగ్లండ్--జపాన్ మధ్య జరిగిన మ్యాచ్ లో తమ టీమ్ కు సపోర్ట్ చేసేందుకు జపాన్ ప్లేయర్లు స్టేడియంకు వచ్చారు. ఈ మ్యాచ్ లో జపాన్ 1--0 తేడాతో ఇంగ్లండ్ పై గెలిచింది. మెన్స్ ఫుట్ బాల్ లో మొదటిసారి ఆసియన్ దేశాల నుంచి ఒక టీమ్ ఇంగ్లండ్ ను ఓడించింది. కౌరు మితోమా చేసిన గోల్ తో.. విన్నింగ్ విజిల్స్ మోగాయి. ఇంగ్లండ్ ఫ్యాన్స్ నిరాశతో సైలెంట్ అయిపోగా.. జపాన్ ఫ్యాన్స్ గెలుపును ఎంజాయ్ చేస్తూనే తమ బాధ్యతను మర్చిపోలేదు. గెలిచాక గోల చేస్తూ.. ప్రత్యర్థి టీమ్ ను తిడుతూ.. అపోజింట్ ఫ్యాన్స్ ను గేలి చేస్తూ.. గొడవలకు దిగుతూ స్టేడియంను వదిలి వెళ్లలేదు. వెంటనే వెళ్లిపోకుండా.. అందరూ వెళ్లే వరకు ఆగి.. తమ సీట్ల ముందు పడి ఉన్న కాగితాలు, పాప్ కార్న్ మగ్స్, ఇతరత్ర చెత్తను కవర్లలో వేసి డస్టుబిన్లలో వేశారు. ఇంగ్లండ్ ఫ్యాన్స్ వెళ్లిపోతున్నా.. ఇది తమ దేశం, తమ స్టేడియం కాకపోయినా ఓపికగా అంతా క్లీన్ చేసి వెళ్లిపోయారు. ముఖ్యంగా ఆరేళ్ల పాప, ఐదేళ్ల బాలుడు కూడా పెద్ద వారితో పాటు క్లీన్ చేస్తుండటం హృదయాలను కరిగించి వేసిన దృశ్యం.

ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. జపాన్ ఫ్యాన్స్ ప్రవర్తన చూసి నెటిజన్లు సలాం చేస్తున్నారు. డిసిప్లిన్, కాండక్ట్, క్వాలిటీస్, జపానీస్ ఫుట్ బాల్ కల్చర్ ను పొగుడుతున్నారు. గతంలో ఇంటర్నేషనల్ మ్యాచ్ లలో, టోర్నమెంట్లలో కూడా జపాన్ ప్రేక్షకులు ఇలాంటి క్లీనింగ్ చేసి ఆకట్టుకున్నారు. మ్యాచ్ తర్వాత క్లీనింగ్ చేయడం తమ దేశానికి మరింత గౌరవం తెస్తుందని వాళ్లు చెబుతున్నారు.

సివిక్ సెన్స్ లో మనం ఎక్కడున్నాం..?

సివిక్ సెన్స్ అంటే.. మనం చేసే పనుల వలన ఇతరులకు కలిగే మంచి, చెడులు. అంటే ఇబ్బందులు. ఈ స్టోరీ చదివాక ఏమనిపిస్తుంది. అదే ప్లేస్ లో మనం ఉంటే ఏం చేసేవాళ్లం. ఐపీఎల్, టీ20 మొదలైన క్రికెట్ మ్యాచ్ లు చూడటానికి వెళ్తుంటాం కదా. మన ప్రవర్తన ఎలా ఉంటుందోఇ ఒక సారి రిమైండ్ చేసుకోవాల్సిన టైం. క్లీనింగ్ చేయకపోయినా పర్లేదు.. కనీసం పరిసరాలను చెత్త చేయకూడదనే కామన్ సెన్స్ మన వాళ్లలో చాల వరకు ఉండదు. అలా పడేయొద్దు బ్రో అంటే.. నువ్వెర్రా నాకు చెప్పడానికి.. అని ఇంకా ఎక్కువ చేస్తుంటాం.

అక్కడ వేయొద్దు అంటే నేను అక్కడే వేస్తా.. ఏం ఇక్కుంటావో ఇక్కో.. అన్నట్లుగా చాలా ర్యాష్ గా ప్రవర్తిస్తుంటాం. అక్కడ ఉమ్మేయొద్దు, అక్కడ పోయొద్దు అని చెప్పినా అదే చేస్తుంటాం. అందుకే స్టేడియంలో గానీ, రోడ్లపై గానీ, సినిమా థియేటర్ లో గానీ.. ఎక్కడ చూసినా చెత్త, చెత్త, చెత్త. డస్ట్ బిన్ లు ఉన్నా మనకు కనబడవు. కానీ జపాన్ ప్రజల సివిక్ సెన్స్ లో మనకు ఒక 25 శాతం వరకు ఉన్నా.. మన పరిసరాలు చాలా వరకు మారిపోతాయి. మీరేమంటారు.

# ఒరాకిల్ దెబ్బకు బెంగళూరు రియల్ ఎస్టేట్ కిల్ : ఐటీ ఉద్యోగుల్లో పెరిగిన ఆందోళనలు

ఐటీ దిగ్గజం ఒరాకిల్ భారత్‌లో ఏకంగా 12వేల మందిని తొలగించడం, రానున్న రోజుల్లో మరిన్ని కోతలు ఉంటాయన్న సంకేతాలు దేశంలోని ఐటీ హబ్ నగరాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన బెంగళూరు రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై ఈ లేఆఫ్స్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఏఐ రాకతో టెక్కీల ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారడమే కాకుండా, వారి సొంతింటి కల కూడా చెదిరిపోయే స్థితికి పరిస్థితులు మారటం కుటుంబాల ఆర్థిక పరిస్థితిని తలకిందులు చేస్తోంది.

**బెంగళూరు రియల్టీపై లేఆఫ్స్ నీడ..**

బెంగళూరులోని సర్జాపూర్, వైట్‌ఫీల్డ్, ఎలక్ట్రానిక్ సిటీ వంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ మార్కెట్ ప్రధానంగా ఐటీ ఉద్యోగుల కొనుగోలు శక్తిపైనే ఆధారపడి ఉంటుంది. ఒరాకిల్ వంటి పెద్ద కంపెనీలు భారీగా లేఆఫ్స్ ప్రకటించడంతో.. కొత్తగా అపార్ట్‌మెంట్లు కొనేందుకు సిద్ధమైన టెక్కీలు తమ నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటున్నారు. దీనివల్ల ప్రీమియం, లగ్జరీ అపార్ట్మెంట్ల అమ్మకాలు భారీగా మందగించే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏఐ వల్ల భవిష్యత్తులో ఏ ఉద్యోగం ఉంటుందో.. ఏది ఊడుతుందో తెలియని సందిగ్ధత మధ్య కోట్ల రూపాయల హోమ్ లోన్ తీసుకోవడానికి ఎవరూ సాహసించడం లేదట.

**లోన్ల భారంతో టెక్కీల ఆర్థిక కష్టాలు..**

ఇప్పటికే అపార్ట్మెంట్లు కొన్న వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. నెలకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల ప్యాకేజీ ఉన్న టెక్కీలు.. ధైర్యంగా కోటిన్నర నుంచి రూ.2 కోట్ల విలువైన ఫ్లాట్లను బ్యాంక్ లోన్లతో కొని ఇరుక్కుపోయారు. ఇప్పుడు ఉద్యోగం కోల్పోవడంతో.. నెలకు లక్ష రూపాయలకు పైగా చెల్లించాల్సిన ఈఎంఐ భారం చాలా ఫ్యామిలీలను కుంగదీస్తోంది. ఒరాకిల్ ఇచ్చిన సెవరెన్స్ ప్యాకేజీ కేవలం కొన్ని నెలల ఈఎంఐలకు మాత్రమే సరిపోతుంది. ఆ తర్వాత మరో ఉద్యోగం దొరకడం కష్టమైతే.. అపార్ట్‌మెంట్‌ను అమ్ముకోవాల్సి వస్తుందని లేదా బ్యాంకులు జప్తు చేస్తాయనే ఆందోళన ఇప్పుడు టెక్కీలను వెంటాడుతోంది.




ఏఐ ప్రభావం వల్ల ఐటీ కంపెనీలు తమ వ్యూహాలను మారుస్తున్నాయి. మనుషుల కంటే మెషీన్లకే ప్రాధాన్యత ఇస్తుండటంతో.. టెక్కీల ఉద్యోగ అవకాశాలు ప్రశ్నార్థకంగా మారాయి. గతంలో ఐటీ ఉద్యోగం అంటే లైఫ్ సెటిల్ అనుకున్న వారు ఇప్పుడు అద్దె ఇళ్లలో ఉండేందుకు ఇష్టపడుతున్నారు. దీనివల్ల బెంగళూరులో రెంటల్ మార్కెట్ పెరిగే అవకాశం ఉన్నప్పటికీ.. అపార్ట్‌మెంట్ల అమ్మకాలు మాత్రం పడిపోయే ప్రమాదం ఉంది. మొత్తానికి ఒరాకిల్ లేఆఫ్స్ కేవలం ఒక కంపెనీ సమస్యగా కాకుండా.. ఐటీ హబ్ నగరాల్లోని రియల్ ఎస్టేట్ సంక్షోభానికి ట్రిగర్ పాయింట్ అవుతుందనే భయాలు పెరుగుతున్నాయి. టెక్కీల సొంతింటి కల నెమ్మదిగా ఇప్పుడు ఏఐ మేఘాల చాటున కనుమరుగవుతోంది.

# తీసేసిన ఒరాకిల్ ఉద్యోగులకు ఎన్ని లక్షల రూపాయలు ఇస్తున్నారంటే..!




అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ ప్రపంచ వ్యాప్తంగా 30వేల మంది ఉద్యోగులను లేఆఫ్ చేయటం భారీ చర్చకు దారితీసింది. చాలా మంది టెక్కీలు తాము అనేక సంవత్సరాలుగా కంపెనీలో నమ్మకంగా పనిచేస్తున్నామని.. అయినా కంపెనీ తమను నిర్దాక్ష్యణంగా తీసేసిందంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఒకరు తనకు క్యాన్సర్ ఉందని 20 ఏళ్లుగా పనిచేస్తున్నా కంపెనీ తొలగించిందని పోస్ట్ చేస్తే.. మరొక మహిళ తాను ప్రెగ్నెంట్ అని కూడా జాలి లేకుండా తొలగించిందంటూ పోస్టు చేశారు. ఇలా చాలా మంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

అయితే అసలు కంపెనీలో ఎంతకాలం ఎంత జీతానికి పనిచేసిన వాళ్లు లేఆఫ్స్ కింద పరిహారం రూపంలో ఎంత డబ్బు పొందుతారనే ఆసక్తికరమైన వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. ఇందులో ఉదాహరణకు ఎంత జీతం ఉంటే చివరికి ఎంత డబ్బు అందుకుంటారో టెక్కీలు పరిశీలిద్దాం..

కంపెనీలో పనిచేసిన ప్రతి సంవత్సరానికి 15 రోజుల జీతం. టర్మినేషన్ తేదీ వరకు ఒక నెల అన్-పెయిడ్ వేతనం. అర్హులైన ఉద్యోగులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ. ఒక నెల నోటీసు పీరియడ్ జీతంతో పాటు, అదనంగా రెండు నెలల జీతం.

**రూ.10 లక్షల ప్యాకేజీతో 2ఏళ్లు పనిచేస్తే:**

ఒరాకిల్ సంస్థ ప్రకటించిన సెవరెన్స్ రూల్స్ ప్రకారం రూ.10 లక్షల వార్షిక ప్యాకేజీతో 2 ఏళ్లు పనిచేసిన టెక్కీకి అందే పరిహారం లెక్కిద్దాం. రెండు ఏళ్ల సర్వీసుకి గానూ 30 రోజుల జీతం రూ.83వేల 333, ఒక నెల నోటీసు పీరియడ్ జీతం రూ.83వేల 333, అదనంగా ఇచ్చే రెండు నెలల టాప్-అప్ జీతం రూ.లక్షా 66వేల 666 కలిపి రూ.3లక్షల 33వేల 332 అందుతాయి. దీనికి తోడు టర్మినేషన్ వరకు రావాల్సిన ఒక నెల అన్-పెయిడ్ వేతనం రూ.83వేల 333 కూడా కలిపితే మొత్తం సుమారు రూ.4లక్షల 16వేల 665 వరకు క్యాష్ రూపంలో అందుకుంటారు. అయితే రెండేళ్లు చేసిన టెక్కీకి గ్రాట్యుటీ వర్తించదు. కేవలం లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ మాత్రమే అదనంగా ఉంటుంది. అంటే ఉద్యోగికి దాదాపు రూ.4.16 లక్షల నుంచి రూ.4.50 లక్షల మధ్య పరిహారం రావొచ్చు.

**5 ఏళ్ల నుంచి పనిచేస్తూ రూ.20లక్షల ప్యాకేజీలో ఉంటే:**

ఒరాకిల్ సంస్థలో రూ.20 లక్షల వార్షిక ప్యాకేజీతో5 ఏళ్లు పూర్తి చేసిన టెక్కీకి, కంపెనీ రూల్స్ ప్రకారం భారీ పరిహారం అందుతుంది. 5 ఏళ్ల సర్వీసుగానూ ఏటా 15 రోజుల చొప్పున మొత్తం 75 రోజుల జీతం రూ.4లక్షల 16వేల 665 లభిస్తుంది. దీనికి ఒక నెల నోటీసు పీరియడ్ జీతం, కంపెనీ అదనంగా ఇస్తున్న రెండు నెలల టాప్-అప్ జీతం కలిపితే మట్నత్తం రూ.4లక్షల 99వేల 998 అవుతుంది. అలాగే 5 ఏళ్లు పూర్తి చేసినందున గ్రాట్యుటీ రూపంలో సుమారు రూ.4లక్షల 80వేల 769 అందుతాయి. వీటికి తోడు ఒక నెల అన్-పెయిడ్ శాలరీని కూడా కలుపుకుంటే.. సదరు ఉద్యోగికి మొత్తం సుమారు రూ.15లక్షల 64వేల 098 వరకు సెవరెన్స్ ప్యాకేజీ లభిస్తుంది. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ అదనంగా ఉంటుంది కాబట్టి.. ఆ టెక్కీకి దాదాపు రూ.16 లక్షలకు పైగానే చేతికి వచ్చే అవకాశం ఉంది.

**10 ఏళ్ల నుంచి పనిచేస్తూ రూ.25లక్షల ప్యాకేజీలో ఉంటే:**

ఒరాకిల్ సంస్థలో రూ.25 లక్షల వార్షిక ప్యాకేజీతో 10 ఏళ్లు నుంచి పనిచేసిన టెక్కీకి, కంపెనీ ప్రకటించిన సెవరెన్స్ రూల్స్ ప్రకారం భారీ మొత్తం అందుతుంది. 10 ఏళ్ల సర్వీసుగానూ ఏటా 15 రోజుల చొప్పున మొత్తం 5 నెలల జీతం రూ.10లక్షల 41వేల 665 లభిస్తుంది. దీనికి ఒక నెల నోటీసు పీరియడ్ జీతం, కంపెనీ అదనంగా ఇస్తున్న రెండు నెలల టాప్-అప్ జీతం తోడవుతాయి. 10 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసినందున గ్రాట్యుటీ రూపంలో సుమారు రూ.12లక్షల 01వేల 923 అందుతాయి. వీటికి తోడు టర్మినేషన్ వరకు రావాల్సిన ఒక నెల అన్-పెయిడ్ వేతనంకలుపుకుంటే, సదరు సీనియర్ టెక్కీకి మొత్తంగా దాదాపు రూ.30లక్షల 76వేల 920 వరకు సెవరెన్స్ ప్యాకేజీ అందొచ్చు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ అదనంగా ఉంటుంది కాబట్టి.. ఉద్యోగికి దాదాపు రూ.32 లక్షలకు పైగానే చేతికి వచ్చే అవకాశం ఉంది. అయితే ఇక్కడ తీసుకున్న లెక్కలు అంచనాలు మాత్రమే వాస్తవంగా అందే ప్రయోజనాల్లో కొంత వ్యత్యాసం ఉండొచ్చు.

## ఒరాకిల్ సడెన్‌గా 30వేల మంది టెక్కీలను ఎందుకు తీసేసింది.. అసలు మిస్టరీ ఏంటంటే..?




సాధారణంగా ఏదైనా కంపెనీ నష్టాల్లో ఉంటేనే ఉద్యోగులను తీసేస్తుంది. కానీ అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం ఒరాకిల్ విషయంలో స్టోరీ వేరే ఉంది. 15 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 17.2 బిలియన్ డాలర్ల ఆదాయం సంపాదించినా.. ప్రపంచవ్యాప్తంగా 30వేల మంది ఉద్యోగులపై వేటు వేయడం ఇప్పుడు కార్పొరేట్ ప్రపంచంలో హాట్ టాపిక్ అయ్యింది. అందులోనూ మన భారత్ నుంచే 12వేల మంది ఉండటం టెక్కీలను వణికిస్తోంది. ఇంతకీ లాభాల్లో ఉన్న కంపెనీకి ఈ లేఆఫ్స్ పిచ్చి ఎందుకు పట్టింది? దీని వెనుక ఉన్న అసలు కారణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

ఒరాకిల్ ఇప్పుడు తన పాత డేటాబేస్ వ్యాపారం కంటే AI మౌలిక సదుపాయాల పైన పగబట్టినట్లుగా పెట్టుబడులు పెడుతోంది. ముఖ్యంగా OpenAI కోసం ఏఐ డేటా సెంటర్లను నిర్మించేందుకు 156 బిలియన్ డాలర్ల భారీ ఒప్పందం కుదుర్చుకుంది. అంటే మన కరెన్సీలో ఈ డీల్ విలువ దాదాపు రూ.14 లక్షల కోట్లు. ఈ ప్రాజెక్ట్ కోసం ఏకంగా 30 లక్షల స్పెషలైజ్డ్ చిప్స్ కొనాల్సి ఉంది. రెండేళ్ల క్రితం కేవలం 6.9 బిలియన్ డాలర్లు ఖర్చు చేసిన కంపెనీ.. ఈ ఏడాది ఏకంగా 50 బిలియన్ డాలర్లను కుమ్మరిస్తోంది. ఈ భారీ పెట్టుబడుల కోసం నిధులను సర్దుబాటు చేయడానికే ఉద్యోగుల సంఖ్యపై కోత విధిస్తోంది.

**అప్పుల ఊబి..**

ఒరాకిల్ నెత్తిన ప్రస్తుతం 108 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.10 లక్షల కోట్లు అప్పు ఉంది. ఈ అప్పును భరించలేక కంపెనీ సతమతమవుతోంది. ఉద్యోగులను తీసేయడం ద్వారా 10 బిలియన్ డాలర్ల నగదును ఆదా చేయాలని ప్లాన్ చేస్తోంది. పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయంటే.. ఒరాకిల్ అప్పులు తీరుస్తుందో లేదో అన్న భయంతో బ్యాంకులు కూడా కంపెనీకి కొత్తగా అప్పు ఇవ్వడం ఆపేశాయి. బార్క్లేస్ వంటి సంస్థలు ఒరాకిల్ క్రెడిట్ రేటింగ్‌ను జంక్ అంటే అత్యంత ప్రమాదకరం అనే స్థాయికి తగ్గించేస్తామని హెచ్చరించాయి. 2009 ఆర్థిక సంక్షోభం తర్వాత ఒరాకిల్ ఇంతటి గడ్డు కాలాన్ని ఎదుర్కోవడం ఇదే మొదటిసారి.

**కస్టమర్ హ్యాండిస్తే పరిస్థితి ఏంటి?**


ఇంత రిస్క్ చేసి ఒరాకిల్ కడుతున్న డేటా సెంటర్లను వాడుకోవాల్సిన ఓపెన్ఏఐ.. ఇప్పుడు ఎన్విడియా నుంచి కొత్త చిప్స్ కోసం చూస్తోందనే వార్తలు ఒరాకిల్ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ఒకవేళ కస్టమర్లు హ్యాండిస్తే.. లక్షల కోట్లు పెట్టి కట్టిన ఇన్ఫ్రాస్ట్రక్చర్ వృథా అయిపోతుంది. సాంకేతికత వేగంగా మారుతుండటంతో.. ఒరాకిల్ కొంటున్న చిప్స్ అవి వాడకంలోకి రాకముందే పాతబడిపోయే ప్రమాదం కూడా ఉందని టెక్ నిపుణులు అంటున్నారు. ఈ సంక్షోభం ఒరాకిల్ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ సంపదను కూడా దెబ్బతీసింది. 2025 సెప్టెంబర్‌లో షేరు ధర 346 డాలర్లు ఉంటే.. ఇప్పుడు అది 146 డాలర్లకు పడిపోయింది. అంటే సగానికి పైగా విలువ ఆవిరైపోయింది. స్టాక్ మార్కెట్లో ఇన్వెస్టర్ల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి, ఆర్థిక క్రమశిక్షణ పేరుతో ఒరాకిల్ తన సంస్థలోని వేలమంది ఉద్యోగులను బలిచేస్తోంది లేఆఫ్స్ పేరుతో. భవిష్యత్తులో ఏఐ ద్వారా అద్భుతాలు చేస్తామని కంపెనీ చెబుతున్నా.. ప్రస్తుతం ఆ సంస్థలో పని చేస్తున్న వేలాది మంది టెక్కీలకు మాత్రం ఇది చీకటి రోజుగానే మిగిలిపోనుంది.

## యుద్ధంతో కండోమ్ తయారీ కంపెనీలకు కష్టాలు.. కల్లోలంలో రూ.8వేల కోట్ల బిజినెస్



గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు ఊహించని విధంగా భారతదేశంలోని కండోమ్ పరిశ్రమపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. యుద్ధంతో సరఫరా వ్యవస్థల్లో అడ్డంకులు, పెట్రోకెమికల్ ఉత్పత్తుల కొరత ఇప్పుడు భారతీయ కండోమ్ తయారీ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. దాదాపు రూ.8వేల కోట్లు విలువ కలిగిన ఈ పరిశ్రమ.. ఏటా 400 కోట్లకు పైగా కండోమ్ యూనిట్లను తయారు చేస్తూ దేశ జనాభా నియంత్రణలో పాత్ర పోషిస్తోంది. కండోమ్ తయారీలో అత్యంత కీలకమైన రెండు ముడి పదార్థాల రేట్లతో పాటు సరఫరాను ఈ యుద్ధం దెబ్బకొట్టింది. మొదటిది సిలికాన్ ఆయిల్. దీనిని కండోమ్ తయారీలో లూబ్రికెంట్‌గా ఉపయోగిస్తారు. ప్రస్తుతం దీనికి భారీ కొరత ఏర్పడింది. రెండవది అమ్మోనియా. తయారీలో లాటెక్స్‌ను స్థిరీకరించడానికి ఇది ఎంతో అవసరం. గల్ఫ్ సంక్షోభం కారణంగా అమ్మోనియా ధరలు ఏకంగా 40 శాతం నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటికి తోడు ప్యాకేజింగ్ కోసం వాడే పీవీసీ, అల్యూమినియం ఫాయిల్ రేట్లు కూడా పెరగడంతో తయారీదారులపై భారం రెట్టింపు అయ్యింది. హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్, మ్యాన్‌కైండ్ ఫార్మా, క్యూపిడ్ లిమిటెడ్ వంటి దిగ్గజ సంస్థలు ఇప్పటికే ఈ సెగను ఎదుర్కొంటున్నాయి. పెట్రోకెమికల్స్ వాడే ప్రతి వస్తువుపై ఈ ప్రభావం ఉందని కర్ణాటక డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ పేర్కొంది. ప్రభుత్వ పరంగా కూడా ముడిసరుకు కేటాయింపుల్లో 35 శాతం వరకు కోత విధించే అవకాశం ఉండటంతో ఉత్పత్తి ప్రక్రియ నెమ్మదించొచ్చని తెలుస్తోంది. ముడిసరుకు లభ్యత లేకపోవడం, లాజిస్టిక్స్ సమస్యల వల్ల ఆర్డర్లను సకాలంలో పూర్తి చేయలేకపోతున్నామని కంపెనీలు చెబుతున్నాయి. 140 కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో కండోమ్ మార్కెట్ తక్కువ ధర – ఎక్కువ అమ్మకాల పైనే నడుస్తోంది. అందువల్ల కండోమ్స్ రేట్లు సామాన్యుడికి అందుబాటులో ఉంటేనే జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ స్కీమ్స్ ఫలితాలను ఇస్తాయి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో తయారీ ఖర్చులు పెరగడం వల్ల కంపెనీలు ధరలు పెంచక తప్పని స్థితిలో ఉన్నాయి. ధరలు పెరిగితే సహజంగానే డిమాండ్ తగ్గుతుంది. ఇది కేవలం వ్యాపార నష్టం మాత్రమే కాదు, దీర్ఘకాలంలో దేశ జనాభా నియంత్రణ లక్ష్యాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెల్త్ కేర్ నిపుణులు అంటున్నారు.

# హెల్తీగా ఉండాలంటే ఈ పనులు చేయద్దు!




మన ఆరోగ్యం మనం తీసుకునే ఆహారం మీద మాత్రమే కాదు, ఆ ఆహారాన్ని దేనిలో నిల్వ చేస్తున్నాం అనే దానిపై కూడా ఆధారపడి ఉంటుంది. ప్లాస్టిక్ కంటైనర్లు చూడటానికి సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ, కొన్ని రకాల ఆహార పదార్థాలతో అవి జరిపే రసాయన చర్యలు మనల్ని అనారోగ్యానికి గురిచేస్తాయి. కేవలం ఆహారమే కాదు, విలువైన వస్తువులు కూడా ప్లాస్టిక్ వల్ల పాడైపోయే అవకాశం ఉంది. మన వంటిల్లు అంటేనే రకరకాల ప్లాస్టిక్ డబ్బాల నిలయం. రంగురంగుల ప్లాస్టిక్ కంటైనర్లు తక్కువ ధరకే లభించడమే కాకుండా, పగిలిపోవనే నమ్మకంతో మనం వాటిని విరివిగా ఉపయోగిస్తుంటాం. అయితే, మనకు తెలియకుండానే ఈ ప్లాస్టిక్ డబ్బాలు మన ఆరోగ్యానికి, మనం దాచుకునే వస్తువులకు తీరని ముప్పు కలిగిస్తున్నాయి. వండని మాంసం : పచ్చి మాంసాన్ని ప్లాస్టిక్ డబ్బాల్లో ఉంచడం వల్ల బ్యాక్టీరియా త్వరగా వృద్ధి చెంది కాలుష్యానికి దారితీస్తుంది. దీనికి బదులుగా గాలి చొరబడని మూత ఉన్న గాజు పాత్రలను వాడటం సురక్షితం. వేడి ఆహారాలు : వేడివేడి పదార్థాలను ప్లాస్టిక్ లో ఉంచినప్పుడు, అధిక వేడి కారణంగా ప్లాస్టిక్ లోని హానికరమైన రసాయనాలు ఆహారంలోకి విడుదల అవుతాయి. ఆహారాన్ని పూర్తిగా చల్లబరిచిన తర్వాతే నిల్వ చేయాలి. టొమాటో సాస్, కూరలు : టమాటలో ఉండే ఆమ్లతత్వం ప్లాస్టిక్ తో చర్య జరిపి మరకలను, వాసనను కలిగిస్తుంది. దీనివల్ల కెమికల్ లీచింగ్ జరిగే ప్రమాదం ఉంది.పండ్లు, ఆకుకూరలు : బెర్రీలు, సిట్రస్ పండ్లు, ఆకుకూరలను ప్లాస్టిక్ లో ఉంచినప్పుడు తేమ పెరిగి అవి త్వరగా బూజు పడతాయి. వీటికి వెంటిలేషన్ ఉన్న పాత్రలు ఉత్తమం.జిడ్డు పదార్థాలు : నూనె, నెయ్యి వంటి కొవ్వు పదార్థాలు ప్లాస్టిక్ తో స్పందించి ఆహారాన్ని కలుషితం చేస్తాయి.ఆహారేతర వస్తువులపైనా ప్రభావం కేవలం కిచెన్ ఐటమ్స్ మాత్రమే కాదు.. పుస్తకాలు, తోలు వస్తువులు), ఫోటోలను ప్లాస్టిక్ పెట్టెల్లో ఉంచడం వల్ల తేమ చేరి అవి వంగిపోవడం లేదా మసకబారడం జరుగుతుంది. కొవ్వొత్తులను ప్లాస్టిక్ లో ఉంచితే ఎండ వేడికి అవి కరిగి ఆకారాన్ని మార్చుకుంటాయి. గాజు పాత్రలు : ఇవి రసాయన రహితమైనవి, వేడిని తట్టుకోగలవు మరియు శుభ్రం చేయడం సులభం.

# మినీ సంజీవని.. వాము ఆకు



వాము ఆకుల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. దీనితో పలు సమస్యలను దూరం చేసుకోవచ్చు. వాము ఆకుల్లో విటమిన్లు, సెలీనియం, జింక్, యాంటీ ఆక్సిడెంట్లతో కూడిన అద్భుతమైన ఔషధ గుణాలున్నాయని.. దీనిని తీసుకుంటే చాలా మంచిదని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు.. ఈ మొక్క కఫ, వాత సంబంధిత వ్యాధులకు చక్కగా పనిచేస్తుంది. వాము ఆకుల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. దీనితో పలు సమస్యలను దూరం చేసుకోవచ్చు.. వాము ఆకు, దీనిని సాధారణ వాడుక భాషలో కర్పూరవల్లి, ఇండియన్ బోరేజ్, కంట్రీ బోరేజ్, ఇండియన్ మింట్ వంటి అనేక పేర్లతో పిలుస్తారు. ఇది మనందరికీ బాగా పరిచయమైన, సులభంగా లభించే ఒక ఔషధ మొక్క. నిజానికి, దీనిలో అపారమైన ఔషధ గుణాలు ఉన్నాయని చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. వాము ఆకులో విటమిన్ ం, అ, సెలీనియం, జింక్, యాంటీ ఆక్సిడెంట్లతో కూడిన అద్భుతమైన ఔషధ గుణాలున్నాయని.. దీనిని తీసుకుంటే చాలా మంచిదని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు.. వాము ఆకు శ్రమక, కఫ, వాత సంబంధిత వ్యాధులకు అద్భుతమైన పరిష్కారం చూపుతుంది. దీని ఆకు రసాన్ని నేరుగా ఔషధంగా చాలా వరకు ఉపయోగించుకోవచ్చు. దీనిని తరచుగా అలంకరణకు, వంటకు ఉపయోగిస్తుంటారు. దీని ఆకు కొద్దిగా వగరుగా, ఘాటుగా రుచిగా ఉంటుంది.. దీని వలన ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. ఇంట్లో చిన్నపిల్లలకు గానీ, కుటుంబ సభ్యులకు గానీ వచ్చే అనేక చిన్నపాటి రోగాలను ఎటువంటి ఇతర మందులు లేకుండా కేవలం వాము ఆకును ఉపయోగించి తగ్గించుకోవచ్చు. ఈ మొక్క శరీరానికి వేడిని ఉత్పత్తి చేస్తుంది. వాము ఆకు వాసన మాత్రమే వాము వలె ఉంటుంది కానీ, వాము వేరే జాతి మొక్క నుండి వస్తుంది. వాము ఆకు మొక్క ఆకు మందంగా, మెత్తగా, బలహీనంగా ఉంటుంది. ఇది నీరు లేకపోయినా చక్కగా బ్రతుకుతుంది.. సుమారు మూడు అడుగుల వరకు పెరుగుతుంది. దీనికి వేరు కూడా అవసరం లేదు,

# పుచ్చకాయ, దోసకాయ ఎండాకాలంలో బాడీకి ఏది మంచిది..?



ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలకు శరీరం త్వరగా డీహైడ్రేషన్‌కు గురవుతోంది. ఈ సమయంలో మనకు తక్షణమే గుర్తొచ్చేవి పుచ్చకాయ, కీర దోసకాయ. ఈ రెండింటిలోనూ నీటి శాతం ఎక్కువే, పోషకాలూ ఎక్కువే. పోషకాల పోరాటం: పుచ్చకాయ, దోసకాయ రెండూ శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడంలో దిట్ట. కానీ వాటిలోని పోషక విలువలు వేరుగా ఉంటాయి. దోసకాయలో విటమిన్ కె, సి తో పాటు పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల బలానికి, గుండె ఆరోగ్యానికి, మలబద్ధకం తగ్గించడానికి ఎంతగానో తోడ్పడతాయి. పుచ్చకాయలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ ఎ, సి ఎక్కువగా ఉంటాయి. సోడియం తక్కువగా ఉండటం వల్ల అధిక రక్తపోటు ఉన్నవారికి ఇది ఒక వరం. నీటి శాతం: హైడ్రేషన్ విషయానికి వస్తే రెండూ అద్భుతమే. అయితే సాంకేతికంగా చూస్తే పుచ్చకాయ కంటే దోసకాయలో నీటి శాతం ఎక్కువ. దోసకాయలో సుమారు 95శాతం నుంచి 96శాతం వరకు నీరు ఉంటే పుచ్చకాయలో 92శాతం ఉంటుంది. కేలరీలు తక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇవి రెండూ మంచి ఆప్షన్లే. వీరు జాగ్రత్తగా ఉండాలి: అమృతం లాంటి పండ్లే అయినప్పటికీ కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వీటిని తినే ముందు ఆలోచించాలి. షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉన్నవారు, కిడ్నీ, తీవ్రమైన జీర్ణ సమస్యలు ఉన్నవారు పుచ్చకాయకు దూరంగా ఉండటం మంచిది. రాత్రిపూట నిద్ర పట్టని వారు దోసకాయ తినకపోవడమే ఉత్తమం. ఆస్తమా, సైనస్, తరచుగా జలుబు చేసే వారు ఈ రెండింటిని పరిమితంగా తీసుకోవాలి లేదా మానుకోవాలి. బడ్జెట్ ఫ్రెండ్లీ ఏది?: ఆర్థికంగా చూస్తే పుచ్చకాయ కంటే దోసకాయ కొనడం, నిల్వ చేయడం సులభం. దోసకాయలో వ్యర్థ భాగం తక్కువగా ఉంటుంది. దీనిని ఫ్రిజ్ లేకుండా కూడా కొంతకాలం నిల్వ చేయవచ్చు. అదే పుచ్చకాయ అయితే పరిమాణం పెద్దదిగా ఉండటం వల్ల ఖర్చు కూడా ఎక్కువే. ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేని వారు ఈ వేసవిలో ఒక రోజు పుచ్చకాయ, ఒక రోజు దోసకాయ మార్చి మార్చి తీసుకోవడం వల్ల గరిష్ట ప్రయోజనాలు పొందవచ్చు. అయితే పండ్లను రసంగా తాగడం కంటే ముక్కలుగా కోసుకుని తినడమే ఆరోగ్యానికి అత్యుత్తమం.

# బ్లాక్‌ప్లాస్టిక్ పెట్టెల్లో ఫుడ్ ప్యాక్ చేస్తున్నారా.?



రెస్టారెంట్లు, హోటల్లు, ఇతర ప్రదేశాలలో నల్ల ప్లాస్టిక్ కంటైనర్ల వాడకంపై భారతీయ జనతా పార్టీ రాజ్యసభ ఎంపీ ఘనశ్యామ్ తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. నల్ల ప్లాస్టిక్ డబ్బాల్లోని ఆహారాన్ని మళ్లీ వేడి చేయడం సురక్షితమేనా? మార్చి 25, 2026న రాజ్యసభలో ప్రజా ప్రయోజన విషయాలపై తీవ్ర చర్చ జరిగింది. రెస్టారెంట్లు, హోటల్లు, ఇతర ప్రదేశాలలో నల్ల ప్లాస్టిక్ కంటైనర్ల వాడకంపై భారతీయ జనతా పార్టీ రాజ్యసభ ఎంపీ ఘనశ్యామ్ తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కంటైనర్లు సాధారణ ప్లాస్టిక్ కాదని, వాటిని రీసైకిల్ చేసిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాల నుండి తయారు చేస్తారని ఆయన పేర్కొన్నారు. వాటిలో వేడి ఆహారాన్ని నిల్వ ఉంచితే, మైక్రోప్లాస్టిక్ కణాలు ఆహారంలోకి చేరవచ్చని ఘనశ్యామ్ తివారీ తెలిపారు. దీనిపై నిపుణులు ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. నివేదికల ప్రకారం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, పారిశ్రామిక ప్లాస్టిక్‌ను నిల్వ చేయడానికి నల్ల ప్లాస్టిక్‌ను తరచుగా ఉపయోగిస్తారు. దీనిని అగ్ని నిరోధకంగా చేయడానికి, డెకాబిడిఇ వంటి మంటలను ఆర్పే రసాయనాలను కలుపుతారు. సమస్య ఏమిటంటే, ఈ రసాయనాలు ప్లాస్టిక్‌కు పూర్తిగా అంటుకోవు. వేడి చేసినప్పుడు, ముఖ్యంగా ఆహారం వేడిగా , నూనెగా ఉన్నప్పుడు, అవి ఆహారంలోకి ప్రవించగలవు. అంతేకాకుండా, ఈ ప్లాస్టిక్‌లో బిపిఎ, థాలేట్స్ వంటి రసాయనాలు కూడా ఉంటాయి. ఇవి హార్మోన్ల పనితీరును దెబ్బతీస్తాయంటున్నారు నిపుణులు. మీరు అటువంటి పాత్రలలో ఆహారాన్ని వేడి చేసినప్పుడు లేదా వాటిని పదేపదే ఉపయోగించినప్పుడు, ఈ రసాయనాలు క్రమంగా శరీరంలో పేరుకుపోయి దీర్ఘకాలిక హానిని కలిగిస్తాయంటున్నారు వైద్యులు హెచ్చరిస్తున్నారు. 2024లో జరిగిన ఒక అధ్యయనం 200కు పైగా నల్ల ప్లాస్టిక్ ఉత్పత్తులను విశ్లేషించి, వాటిలో దాదాపు 85 శాతం ఉత్పత్తులలో విషపూరితమైన ఫ్లేమ్ రిటార్డెంట్లు ఉన్నట్లు కనుగొంది. ఈ రసాయనాలకు దీర్ఘకాలం పాటు గురికావడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఃఖం, థాలేట్స్ వంటి మూలకాలు హార్మోన్ల అసమతుల్యతకు కారణం కావడమే కాకుండా, గుండె జబ్బులు, మధుమేహం, పునరుత్పత్తి సంబంధిత సమస్యల ప్రమాదాన్ని కూడా పెంచుతాయని వివరిస్తున్నారు. అంతేకాకుండా, నల్ల ప్లాస్టిక్ నుండి విడుదలయ్యే మైక్రోప్లాస్టిక్‌లు కూడా శరీరంలోకి ప్రవేశించి విషభారాన్ని పెంచుతాయని, ఇది దీర్ఘకాలంలో వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని వైద్య నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీ స్త్రీలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారిపై దీని ప్రభావాలు మరింత తీవ్రంగా ఉండవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్యాన్సర్‌తో దీనికి ప్రత్యక్ష సంబంధం ఉందని నిశ్చయంగా నిరూపించనప్పటికీ, ఇందులోని రసాయనాల పట్ల జాగ్రత్తగా ఉండటం ముఖ్యం. నల్ల ప్లాస్టిక్ పాత్రలకు బదులుగా గాజు, స్టీలు, చెక్క పాత్రలను ఉపయోగించాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. ప్లాస్టిక్‌ను, ముఖ్యంగా ఆహారాన్ని వేడి చేయడానికి, వాడకపోవడమే అత్యంత సురక్షితమైన పద్ధతి అంటున్నారు.

# ఎండాకాలం ఓ గ్లాసు తాగితే కూల్ కూల్..



వేడి వాతావరణంలో అలసట, డీహైడ్రేషన్ సమస్యలతో పాటు జీర్ణ సమస్యలు ఎదుర్కొంటున్న వారికి బార్లీ నీరు ఒక సులభమైన, ప్రభావవంతమైన సహజ పరిష్కారం.. ఈ పురాతన ఆయుర్వేద పానీయం శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆధునిక జీవనశైలిలో ఎదురయ్యే డీహైడ్రేషన్, జీర్ణ సమస్యలు, అనేక ఇతర ఆరోగ్య సవాళ్లకు బార్లీ నీరు ఒక పురాతన, సహజసిద్ధమైన, ప్రభావవంతమైన పరిష్కారం. ఆయుర్వేదంలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ఇది శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడమే కాకుండా, సమగ్ర ఆరోగ్యాన్ని పెంపొందించే అనేక ప్రయోజనాలను అందిస్తుంది. వాస్తవానికి బార్లీ నీరు ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలతో (మెగ్నీషియం, మాంగనీస్, సెలీనియం, ఐరన్) నిండిన అద్భుతమైన ఆరోగ్య పానీయం.. ఇది మూత్రపిండాల ఆరోగ్యం, బరువు తగ్గడం, షుగర్ నియంత్రణ.. శరీరాన్ని డీటాక్సిఫై చేయడంలో సహాయపడుతుంది.

బార్లీ నీరు ఆరోగ్య ప్రయోజనాలు:జీర్ణక్రియ మెరుగుపడుతుంది: బార్లీ నీటిలో అధికంగా ఉండే డైటరీ ఫైబర్ ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్‌ను ప్రోత్సహిస్తుంది, ప్రేగు కదలికలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది గ్లూకోజ్ శోషణను నెమ్మదిస్తుంది.. తద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. మధుమేహులు లేదా రక్తంలో చక్కెర నియంత్రణకు ప్రయత్నిస్తున్న వారికి ఇది చాలా ప్రయోజనకరమైనది. కొలెస్ట్రాల్ నియంత్రణ: బార్లీ నీరు శరీరం నుండి బైల్ యాసిడ్‌ను తొలగించడం ద్వారా కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. కాలేయం కొత్త బైల్ యాసిడ్‌ను తయారుచేయడానికి ఎక్కువ కొలెస్ట్రాల్‌ను ఉపయోగించేలా చేయడం ద్వారా మొత్తం కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. మూత్రనాళ ఆరోగ్యం: ఇది సహజమైన మూత్రవిసర్జనకారిగా పనిచేస్తుంది.. మూత్ర ఉత్పత్తిని పెంచుతుంది. మూత్ర నాళాల నుండి విష పదార్థాలు, బ్యాక్టీరియాను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ డిటాక్సిఫికేషన్ ప్రక్రియ కాలేయానికి కూడా మేలు చేస్తుంది. ఎలక్ట్రోలైట్ సమతుల్యత: పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం వంటి ముఖ్యమైన ఖనిజాలు బార్లీ నీటిలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలో ద్రవ సమతుల్యత, కండరాల పనితీరుకు చాలా అవసరం. వేడి వాతావరణం, శారీరక శ్రమ లేదా వ్యాయామం వల్ల కోల్పోయే ఎలక్ట్రోలైట్లను భర్తీ చేయడంలో ఇది సహాయపడుతుంది. ఆయుర్వేదం ప్రకారం, బార్లీ నీరు వాత, పిత్త, కఫ అనే త్రిదోషాలను సమతుల్యం చేయగలదు. బార్లీ నీరు మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడానికి సులభమైన, పోషకాలతో నిండిన పానీయం. ఇది డీహైడ్రేషన్ నుండి జీర్ణక్రియ వరకు, కొలెస్ట్రాల్ నియంత్రణ నుండి ఎలక్ట్రోలైట్ సమతుల్యత వరకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

# పొద్దునే వేడి నీళ్లు తాగితే అద్భుతాలు జరుగుతాయా?



ఖరీదైన మందులు, సప్లిమెంట్స్ కంటే ప్రకృతి సిద్ధమైన ఇటువంటి చిన్న మార్పులు మన ఆరోగ్యంపై పెద్ద ప్రభావం చూపుతాయి. టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షలాది వ్యూస్ సంపాదిస్తున్న ఈ వీడియోలలో ప్రజలు ఉదయాన్నే వేడి నీళ్లు తాగడం, వేడి అల్పాహారం తీసుకోవడం మరియు చిన్నపాటి వ్యాయామాలు చేయడం కనిపిస్తుంది. దీనిని 'న్యాలీ చైనీస్' అని కూడా పిలుస్తున్నారు. నేటి కాలంలో సోషల్ మీడియా ప్రభావం ఎంతగా ఉందంటే, వేల ఏళ్ల నాటి సంప్రదాయాలు కూడా సరికొత్త 'ట్రెండ్స్' రూపంలో మన ముందుకు వస్తున్నాయి. 21 ఏళ్ల మరియమ్ ఖాన్ లాంటి ఎంతోమంది యువత ఇప్పుడు ఖరీదైన స్కిన్ కేర్ ప్రోడక్ట్స్ లేదా కఠినమైన వర్కవుట్స్ జోలికి వెళ్లకుండా.. ఒక చిన్న అలవాటును పాటిస్తున్నారు. అదే 'ఉదయాన్నే వేడి నీళ్లు తాగడం'. చైనా సంప్రదాయ వైద్యం మరియు మన ఆయుర్వేదంలో ఎప్పటి నుంచో ఉన్న ఈ విధానం, ఇప్పుడు టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో 'చైనా మ్యాక్సింగ్' పేరుతో వైరల్ అవుతోంది. వేల సంవత్సరాలుగా చైనీస్ మెడిసిన్, మన భారతీయ ఆయుర్వేద వైద్య విధానాల్లో వేడి నీటికి గొప్ప ప్రాధాన్యత ఉంది. ఉదయాన్నే వేడి నీరు తాగడం వల్ల శరీరంలోని జీర్ణవ్యవస్థ యాక్టివేట్ అవుతుంది. ఇది ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, మలబద్ధకం వంటి సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది. వేడి నీరు శరీర ఉష్ణోగ్రతను స్వల్పంగా పెంచుతుంది, దీనివల్ల చెమట పట్టి శరీరంలోని టాక్సిన్లు బయటకు పోతాయి. గోరువెచ్చని నీరు తాగడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి, శరీరమంతటా రక్త ప్రసరణ మెరుగ్గా జరుగుతుంది. ఇది కండరాల నొప్పులను కూడా తగ్గిస్తుంది. ప్రస్తుతం యువత ఈ పాత పద్ధతులకు ఆధునిక మెరుగులు దిద్దుతోంది. కేవలం నీళ్లే కాకుండా, వేడి వేడి అల్పాహారం తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన శక్తి లభిస్తుందని వారు నమ్ముతున్నారు. ఈ వీడియోలు చూసి ఆధునిక యువత తమ జీవనశైలిని మార్చుకుంటున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది కేవలం మారుతున్న ఫ్యాషన్ కాదు. చల్లటి నీటి కంటే గోరువెచ్చని నీరు శరీరానికి ఎక్కువ మేలు చేస్తుందని సైన్స్ కూడా అంగీకరిస్తోంది. ముఖ్యంగా ఉదయాన్నే ఖాళీ కడుపుతో దీనిని తీసుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. అయితే, నీరు మరీ ఎక్కువగా మరిగించినది కాకుండా, గొంతుకు హాయిగా ఉండేలా 'గోరువెచ్చగా' ఉండటం ముఖ్యం. మరి మీరు కూడా రేపటి నుండి ఈ 'హాట్ వాటర్ ఛాలెంజ్' మొదలుపెడతారా?

